# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :234 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 26-11-2025 | పేజీలు:4 వెల: 2.00


## అధికారిక వాహనం వదిలిన మాజీ సిజెఐ గవాయ్

న్యూఢిల్లీ, సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణం చేసారు. ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్ తాను వచ్చిన అధికారిక కారును కొత్త సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద వదిలివెళ్లినట్లు జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. నిబంధనల ప్రకారం సీజేఐగా పదవీవిరమణ చేసిన అనంతరం మాజీ సీజేఐలు తాము ఉంటున్న అధికారిక నివాసాలను, సీజేఐకి ప్రభుత్వం ఇచ్చే ఇతర సౌకర్యాలను వీడాల్సి ఉంటుంది. అందులోభాగంగానే జస్టిస్ గవాయ్ కారును సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కోసం రాష్ట్రపతి భవన్ వద్ద వదిలివెళ్లినట్లు తెలుస్తోంది. అయితే జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపట్టిన వెంటనే జస్టిస్ గవాయ్ కారును అక్కడే వదిలివేయడం గమనార్హం. ఈ ఏడాది మే 14వ తేదీన 52వ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బి.ఆర్.గవాయ్ పదవీకాలం

## తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం గుడ్‌న్యూస్!



హైదరాబాద్,తెలంగాణను సమగ్రంగా, ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు సమోదయ్యే రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047'ను రూపుదిద్దుతోంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం నుంచి ఈ నెల 30 వరకు అన్నీ శాఖల వారీగా సమీక్షలు చేపట్టనున్నారు. గత రెండు సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన పురోగతి, మరికొన్ని దశాబ్దాలలో చేరుకోవలసిన లక్ష్యాలు, వాటి కోసం రూపొందించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశాల్లో స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి పునాది రంగాల్లో సమగ్ర మార్పులకే ఈ విజన్ కీలక ఆధారం కానుంది. యువతకు ఆధునిక నైపుణ్యాల్ని అందించడానికి ఐటీ, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఆంత్రప్రెన్యూర్‌షిప్ రంగాల్లో ప్రపంచ స్థాయి శిక్షణను అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణను గ్లోబల్ స్కిల్ కేపిటల్‌గా తీర్చిదిద్దడమే ముఖ్య లక్ష్యంగా పెట్టుకుంది.

### గ్లోబల్ సమ్మిట్ కు సిద్ధం

ఈ నెల 8, 9 తేదీల్లో టెలంగానా ఫ్యూచర్ సిటీలో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'లో ఈ విజన్ డాక్యుమెంట్ ని ప్రధాన అంశాలు చర్చకు రానున్నాయి. తొలి రోజున విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళాభివృద్ధి, యువత నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలు, సంక్షేమ పథకాల అమలు వంటి సామాజిక రంగాలతో సంబంధిత సెషన్లు నిర్వహించనున్నారు. రెండోరోజున పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, మౌలిక వసతులు, పెట్టుబడిల ఆకర్షణ, సృజనాత్మక పరిశోధనలు, పరిశ్రమీకరణ వేగం వంటి అంశాలపై అంతర్జాతీయ నిపుణులు చర్చించనున్నారు.సమిట్‌లో ప్రపంచ దేశాల రాయబారులు, ప్రముఖ పరిశ్రమల ప్రతినిధులు, పరిశోధకులు, జాతీయ-అంతర్జాతీయ సంస్థల నాయకులు లు పాల్గొనే అవకాశముందని ప్రభుత్వం అంచనా వేస్తుంది . అదే రోజు 'తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047'ను సీఎం విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక డ్రోన్ షోను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

### మూడు కోర్ జోన్ల అభివృద్ధి నమూనా

రాష్ట్ర అభివృద్ధిని వికేంద్రీకరించే దిశగా మూడు కోర్ జోన్ల కాన్సెప్ట్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది.అర్బన్ కోర్ (హైదరాబాద్): డీప్‌టెక్, ఏఐ, ఇండస్ట్రీ 4.0, ఇంజినీరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్, జీసీసీలు, స్టార్టప్ ఎకోసిస్టమ్, గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ లను పెంపొందించే కేంద్రంగా నగరం అభివృద్ధి చెందనుంది.సెమీ-అర్బన్ జోన్లు (జిల్లా కేంద్రాలు): ఎకో-ఇండస్ట్రియల్ పార్కులు, పర్యావరణ ప్రమాణాలకు అనుగుణమైన పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పడనున్నాయి.రూరల్ తెలంగాణ: టెక్నాలజీ ఆధారిత వ్యవసాయం, పశు సంవర్ధక, చేపల పెంపకం, అడవి వనరుల ఆధారిత జీవనోపాధులను బలోపేతం చేయడం, హ్యాండ్లూమ్-హ్యాండీక్రాఫ్ట్ రంగాలకు ప్రత్యేక ప్రోత్సాహం అందించనున్నారు. గ్రామీణ పర్యాటకాన్ని కూడా విస్తృతంగా అభివృద్ధి చేయాలనే యోచన ఉంది.

### సస్టైనబుల్ పాలసీలు, పెట్టుబడి ఆకర్షణ లక్ష్యం

పెట్టుబడులను మరింతగా ఆహ్వానించేందుకు లో-కార్బన్ మార్గదర్శకాలు, గ్రీన్ ఇండస్ట్రియల్ ప్రోత్సాహాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు వంటి అంశాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వ్యవసాయ రంగంలో మార్కెట్ యాక్సెస్ విస్తరణ, పంట వైవిధ్యీకరణ, అగ్రిటెక్ వినియోగం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యం.

### 2047 లక్ష్యం- ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవితం

విద్య, పోషణ, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో వ్యవస్థల సమన్వయం ద్వారా ప్రతి పౌరుడు ఆరోగ్యవంతమైన, గౌరవప్రదమైన, భద్రతతో కూడిన జీవితం గడపాలనే దీర్ఘకాల దృష్టితో ఈ దార్శనిక పత్రం సిద్ధమవుతోంది.


## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

భద్రాద్రి కొత్తగూడెం. నవంబర్ 25 : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుకోవాలని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన జరిగిన దీక్షా దివస్ సన్నాహక సమాశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భద్రాద్రి జిల్లా స్థానిక ఎన్నికల్లో గులాబీమయం కాబోతుందని, అన్ని పంచాయతీలు కైవసం చేసుకోబోతుందని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా భద్రాద్రి జిల్లాలో ఐదు నియోజకవర్గాలతో పాటు అన్ని పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాలు బీఆర్ఎస్ గెలవబోతుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలను మోసం చేసి స్థానిక ఎన్నికలు జరుపుతుందన్నారు. రేవంత్ రెడ్డికి స్థానిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు.పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. ఈ నెల 29న జరిగే దీక్షా దివస్ కార్యక్రమం జిల్లా పార్టీ కార్యాలయంలో భారీ స్థాయిలో జరగబోతుందని, ఈ కార్యక్రమానికి ప్రతి మండలం నుండి 100 మంది కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం నియోజకవర్గానికి ఎన్నికల ఇన్‌చార్జిగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఉండనున్నట్లు తెలిపారు. భద్రాద్రి జిల్లాలోని భద్రాచలంలో ఉప ఎన్నిక తప్పకుండా జరుగుతుందని ఆ ఎన్నికలో గులాబీ పార్టీ విజయ ఢంకా మోగిస్తుందని చెప్పారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్య పడొద్దని, అన్ని మండలాల్లో మండల కమిటీలు, పట్టణ కమిటీలు వేయడం జరిగిందని, త్వరలో జిల్లా కమిటీ కూడా పూర్తిస్థాయిలో ఏర్పడబోతుందని తెలిపారు. సీనియర్



నాయకులకు ప్రతి సమావేశంలో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ నాయక్, మెచ్చ నాగేశ్వరరావు, భద్రాచలం ఇన్‌చార్జి రామకృష్ణ, భద్రాచలం నాయకులు రావులపల్లి రాంప్రసాద్. ఇల్లెందు సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు దిండిగల రాజేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ కాపు సీతా మహాలక్ష్మి, మాజీ జడ్పిటిసి వెంకటరెడ్డి, లక్ష్మిపల్లి మండలాధ్యక్షుడు పొట్టి వెంకటేశ్వర్లు, మణుగూరు మాజీ జడ్పీటీసీ పోసం నరసింహారావు, ఇల్లెందు, భద్రాచలం, అసరాపేట, కొత్తగూడెం, పినపాక నియోజకవర్గం మండల కమిటీల సభ్యులు హాజరయ్యారు.

## నీకు మహిళలు ఎందుకు ఓటెయ్యాలి.. సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు



హైదరాబాద్, కేసీఆర్ ప్రతి బతుకమ్మకు 18 ఏండ్లు నిండిన కోటి 30 వేల మంది మహిళలకు చీరెలు అందించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్ హెచ్ జీ గ్రూప్ లో ఉన్న సుమారు 40 లక్షల మందికి మాత్రమే చీరెలు ఇస్తున్నారని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 3.83 లక్షల మంది మహిళలు ఉంటే 1.99 లక్షల మందికి మాత్రమే చీరెలు ఇస్తున్నారని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గ స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒక్క ఏడాదికి మాత్రమే చీరే ఇచ్చి సారే పెట్టిన అంటున్నారని విమర్శించారు. ఒక్క చీర ఇచ్చాను ఇగ సర్పంచ్ ఎన్నికల్లో ఆడోళ్ళంత ఓట్లు గుద్దుండ్రి అని రేవంత్ రెడ్డి అంటున్నాడని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద రేవంత్ రెడ్డి మహిళలకు ఇస్తానన్న నెలకు రూ. 2500 సంగతి ఏందని ప్రశ్నించారు. రెండేళ్లకు సంబంధించి 60వేలు ఇచ్చి సారే పెట్టాలని డిమాండ్ చేశారు. రెండు చీరలు ఇస్తామని ఒకటే ఇచ్చిన నీకు మహిళలు ఎందుకు ఓటేయ్యాలని ప్రశ్నించారు.పట్టణ ప్రాంతాల్లో చీరెలు లేవు వడ్డీలేని రుణాలు లేవని హరీశ్‌రావు విమర్శించారు. పట్టణంలో ఎన్నికలు లేవు కాబట్టి చీరలు లేవు వడ్డీ లేని రుణాలు లేవని అన్నారు. మహిళాసంఘాలు 25 వేల కోట్ల రుణాలు తీసుకుంటే 5 వేల కోట్లకు మాత్రమే వడ్డీలేని రుణం వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం 20 పైసలు ఇస్తూ 80 పైసలు ఎగబడుతుందని అన్నారు. మొత్తం డబ్బులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలన్నారు. గతంలో స్త్రీ నిధి కింద రుణాలు ఇచ్చాం.. ఇప్పుడు స్త్రీ నిధి వడ్డీ ఋణం ఇవ్వడం లేదని అన్నారు. స్త్రీ నిధికి కూడా వడ్డీలేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళల పక్షాన అసెంబ్లీలో కూడా మాట్లాడుతానని తెలిపారు.మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఒక్క మహిళా సంఘాలకి ఒక్క బస్సు కూడా ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలోని మహిళ సంఘాలకు ఒక్క ఆర్టీసీ బస్సులు ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఇస్తామని నేటికి రెండు ఏళ్ళు అయిన ఒక్క మెగావాట్ పవర్ ఎక్కడ కూడా పెట్టలేదని చెప్పారు. కేసీఆర్ పండుగ పండుగకి సంక్షేమ పథకాలు ఇస్తే రేవంత్ రెడ్డి ఓట్ల ఓట్లకు సంకేమ పథకాలు ఇస్తున్నారని అన్నారు. రైతుబంధు ఓట్లకు%ొా% చీరల పంపిణీ ఓట్లకే .. వడ్డీ లేని రుణాలు ఓట్లకే అని ఎద్దేవా చేశారు. రుణమాఫీ సగం ఇచ్చిండు సగం ఎగొట్టిండు అని అన్నారు. ఆశ పెట్టడం.. ఆయాస పెట్టడం.. మభ్య పెట్టడం.. మోసం చేయడం ఈ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని విమర్శించారు.

### ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

వేములవాడ, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. కాంగ్రెస్ నేతలు, అధికారులతో కలిసి వేములవాడ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంగళవారం ఉదయం ఆయన పరిశీలించారు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్ గరీమ అగర్వాల్, పార్టీ నేతలతో కలిసి గృహ సముదాయం వద్ద బేస్‌మెంట్‌పై నిల్చొని పరిశీలిస్తున్న క్రమంలో ఒక్కసారిగా అది కుంగింది.

## అయోధ్య రామాలయ శిఖరంపై కాషాయ జెండాను ఆవిష్కరించిన ప్రధాని మోదీ

అయోధ్య: అయోధ్యలో నిర్మించిన రామాలయంపై ఇవాళ ధ్వజారోహణం జరిగింది. ఆలయ శిఖరంపై ఏర్పాటు చేసిన ధ్వజస్తంభంపై కాషాయ జెండా ఎగిరింది. దీంతో అయోధ్య రామాలయ నిర్మాణం సంపూర్ణమైంది. ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్.. ఇవాళ ఉదయం 11.50 నిమిషాలకు జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ అద్భుత ఘటాన్ని తిలకించిన కాషాయ భక్తులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ప్రధాని మోదీ నేతృత్వంలో అయోధ్య రామ్‌లల్లా ఆలయాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. ఉత్తర భారత దేశానికి చెందిన నగరా శైలిలో ఆలయాన్ని నిర్మించారు.ధ్వజారోహణ జెండా ఆవిష్కరణ కార్యక్రమం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. త్రికోణంలో ఉన్న కాషాయ జెండాను శిఖరంపై ఎగురవేశారు. 10 ఫీట్ల ఎత్తు, 20 ఫీట్ల వెడల్పుతో ఆ జెండా ఉన్నది. ఆ జెండాలో ధగధగలాడే సూర్యుడి చిహ్నం ఉన్నది. శ్రీరాముడి ప్రతాపానికి గుర్తుగా సూర్య చిహ్నం ఉన్నది. కోవిదార వృక్షంతో పాటు ఓం చిహ్నం కూడా ఆ జెండాలో నిక్షిప్తం చేశారు. గౌరవం, ఐక్యత, సంస్కృతిక సమానత్వానికి చిహ్నంగా కాషాయ జెండాను ఎగురవేశారు. రామరాజ్యం ఆదర్శంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కూడా పాల్గొన్నారు.అయోధ్యలో రామ్‌లల్లాకు ప్రాణప్రతిష్ట చేసిన 673 రోజుల తర్వాత ఆలయ శిఖరంపై ధ్వజారోహణం చేశారు.

### భారతీయ నాగరికతకు ఈ జెండా పునర్జీవం: ప్రధాని మోదీ

అయోధ్య: అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ ఇవాళ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ధర్మ ధ్వజం కేవలం జెండా మాత్రమే కాదు అని, భారతీయ నాగరికతకు పునర్జీవంగా ఈ పతాకం నిలుస్తుందని అన్నారు. కాషాయ జెండా సూర్యవంశానికి చిహ్నమని, ఓం



అక్షరం.. కోవింద వృక్షం .. రామరాజ్యానికి సంకేతంగా నిలుస్తుందన్నారు. సంకల్పానికి, సక్సెస్‌కు ఈ జెండా చిహ్నమన్నారు. వందేళ్ల పోరాటానికి.. రాబోయే వేల శతాబ్దాలకు ఈ జెండా రాముడి విలువలను చాటుతుందన్నారు.సత్యమే ధర్మం అని ప్రధాని మోదీ అన్నారు. వివక్ష, బాధ ఉండకూడదని, శాంతి.. సంతోషం ఉండాలన్నారు. పేదరికం ఉండకూడదని, ఎవరూ నిస్సహాయంగా ఉండరాదన్నారు. గుడికి రాలేని వారు, గుడిపై ఎగురుతున్న జెండాను చూసినా.. వారికి అంతే పుణ్యం దక్కుతుందని మన గ్రంధాలు చెబుతాయని, చాలా దూరం నుంచి కూడా జెండాను చూసి రామ్‌లల్లా పుట్టిన ప్రదేశం ఇదే అన్న ప్రేరణ పొందవచ్చు అన్నారు.ఈ అద్భుతమైన సందర్భంలో కోట్లాది మంది రామ భక్తులకు హృదయ పూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రామాలయ నిర్మాణం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రామాలయ నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికుడు, కళాకారుడు, ప్లానర్, ఆర్కిటెక్ట్, వర్కర్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

## జీహెచ్ఎంసీ కౌన్సిల్ చివరి సమావేశం..బీజేపీ వినూత్న నిరసన



హైదరాబాద్ : జీహెచ్ఎంసీ కౌన్సిల్ ప్రస్తుత పాలకవర్గం పదవీ కాలంలో చివరి సమావేశం మేయర్ విజయలక్ష్మిఅధ్యక్షతన మంగళవారం ప్రారంభమైంది. 2028 ఫిబ్రవరి 11తో జీహెచ్ఎంసీ పాలకవర్గం గడువు ముగిసిపోనుంది. జనవరిలో బడ్జెట్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో పాటు కౌన్సిల్ మీటింగ్‌కి నగరానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. 95 ప్రశ్నలు, 45 ఎజెండా అంశాలపై సభ్యులు చర్చించనున్నారు.ప్రస్తుత పాలకవర్గం గత ఐదేళ్లలో పారిశుద్ధ్యం సమస్యలపై దారుణంగా విఫలమైందని ఆరోపిస్తూ..బీజేపీ కార్పొరేటర్లు చేతులకు సంకెళ్లు, నోటికి నల్లగుడ్డలు ధరించి.. దున్నపోతుతో నిరసన వ్యక్తం చేస్తూ కౌన్సిల్ సమావేశానికి వచ్చారు. నగర సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డికి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మికి, అధికారులకి వినతిపత్రం ఇవ్వడం కన్నా.. దున్నపోతుకి ఇవ్వడం మేలంటూ నినాదాలు చేశారు. అనంతరం జీహెచ్ఎంసీ పరిసరాల్లో రోడ్లు ఊడ్చి నిరసన కొనసాగించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు సమావేశానికి ర్యాలీగా వచ్చారు. ప్రస్తుత కౌన్సిల్ కు ఇదే చివరి జనరల్ బాడీ సమావేశం కావడంతో నగరంలో ఉన్న సమస్యలపై నిలదీయడానికి సిద్ధమైన బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు సిద్ధమయ్యారు. అందుకు సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తుతున్నారు. భూముల అమ్మకంపై పాలకవర్గాన్ని బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నించబోతున్నారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీని రద్దు చేయాలని ప్లకార్డులతో నిరసన తెలుపుతూ ర్యాలీగా జీహెచ్ఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. సభ్యుల నుంచి ప్లకార్డ్సు తీసుకునేందుకు మార్షల్స్ కౌన్సిల్ సమావేశానికి రావడంతో సభ్యుల నిరసనతో గందరగోళం నెలకొంది. ప్రస్తుత కౌన్సిల్ పదవీకాలం ముగియనుండడంతో జీహెచ్ఎంసీ కౌన్సిల్ హాల్ లో ప్రస్తుత సభ్యులతో టీ బ్రేక్ సమయంలో మేయర్, సభ్యులందరితో కలిసి గ్రూప్ ఫోటో దిగనున్నారు. వచ్చే బడ్జెట్ సమావేశంలో సభ్యులందరికి ఈ ఫోటోను అందించనున్నారు.

## లీకులపై సీరియస్..లీకు వీరులపై ఇంటెలిజెన్స్ విభాగం ఆరా

హైదరాబాద్: సచివాలయంలో డ్రాఫ్ట్ దశలోనే ఉత్తర్వులు మాయమవుతుండటం, అవి కాస్తా బిఆర్ఎస్ ఆఫీసుకు చేరుతుండటాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటోంది. ఈ క్రమంలోనే సమగ్ర విచారణ కు ప్రభుత్వం ఆదేశించింది. సమాచారాన్ని లీక్ చేస్తున్నదెవరు? జీఓ బయటకు రాకముందే ఎక్కడి నుంచి ఈ సమాచారం బయటకు వెళుతుందన్న అంశాలపై ఇంటెలిజెన్స్ విభాగం ఆరా తీస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం అన్ని శాఖలకు సంబంధించిన యూజర్ ఐడిలను, పాస్‌వర్డ్‌లను మార్చివేసింది. దీంతోపాటు ప్రభు త్వం తీసుకునే నిర్ణయాలు, డ్రాఫ్టులు, జిఓలు ప్రభుత్వం నుంచి ఆమోదం లభించే వరకు బయటకు రాకూడదని ఒకవేళ వస్తే ఆ శాఖ ఉన్నతాధికారులనే బాధ్యులను చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.ఈ నేపథ్యంలోనే ఎప్పటికప్పుడు ఆ శాఖ ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఇప్పటికే ప్రభుత్వం అన్ని విభాగాల ఇన్‌చార్జీలను ఆదేశించింది. దీంతో రానున్న రోజుల్లో ఆయా విభాగాలు తీసుకునే నిర్ణయాలు, మంత్రిమండలి ఆమోదాలు, జిఓలు తదితర విషయాల ను లీక్ చేయకుండా పటిష్టమైన చర్యలను చేపట్టాలని ప్రభుత్వం అన్ని శాఖల ఉన్నతాధికారులకు సూచించింది. ఈ ఆదేశాలను పాటించకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని ప్ర భుత్వం హెచ్చరించింది. ఇటీవల భూముల కే టాయింపు అంశంపై మాజీ మంత్రి కెటిఆర్ ప్రెస్‌మీట్ పెట్టి హైదరాబాద్ ఇండస్ట్రీయల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ పాలసీ వెనుక రూ.5లక్షల కోట్ల భూ కుంభకోణం ఉందని ఆరోపించారు.కెటిఆర్ ఆరోపణలపై ప్రెస్ మీట్ పెట్టిన



పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో ఇచ్చిన జీఓనే తాము ఫాలో అవుతున్నామని క్లారిటీ ఇచ్చారు. తాము ఇంకా అలాంటి జీఓనే ఇవ్వలేదంటూ వివరణ ఇచ్చారు. మీరు జీఓ ఇవ్వకుండానే బిఆర్ఎస్ పార్టీకి ఎలా చేరిందని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ఆయన దాట వేశారు. ఈ క్రమంలోనే ఇంటిదొంగలెవరో తేల్చే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. ఇలా ప్రతిపక్షానికి ఎలాంటి సమాచారం లీకవుతోంది..? డ్రాఫ్ట్ దశలో ఉన్న జీఓలు ఎలా బయటకు వెళ్తున్నాయన్న అంశంపై ఆరా తీసే పనిలో ఇంటెలిజెన్స్ నిమగ్నమైనట్టుగా తెలిసింది.

## ఇండస్ట్రియల్ భూముల అమ్మకంపై బీఆర్ఎస్ పోరు..



హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ప్రారంభానికి ముందైె రభస మొదలైంది. పారిశ్రామిక వాడల భూములను అమ్మేలా రూపొందించిన పాలసీని రద్దు చేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ కార్యాలయానికి నిరసన తెలుపుతూ ర్యాలీగా వెళ్లారు. రూ.5 లక్షల కోట్ల విలువైన 9,292 ఎకరాల భూములను అమ్మేస్తూ.. రేవంత్ రెడ్డి సర్కార్ దేశంలోనే అతిపెద్ద స్కామ్‌కు తెరలేపిందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఇండస్ట్రియల్ కారిడార్ భూములను అమ్ముతున్న HILTP పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

## సంపాదకీయం

**బుధవారం 26-11-2025**

# సమృద్ధి సాధనలో సహకారం

అయిదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించాలనే భారతదేశ ఆశయ సాఫల్యంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషించగలవు. భారత్‌లో 28 రంగాల్లో మొత్తం 8.45 లక్షల సహకార సంఘాలు ఉండగా, వాటిలోని సభ్యుల సంఖ్య 30 కోట్లకన్నా ఎక్కువే. దేశమంతటా అయిదారు అమూల్ తరహా భారీ సహకార సంఘాలను నెలకొల్పాలంటూ ఇటీవల ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును జన భారతం అందిపుచ్చుకోవాలి. ప్రపంచంలోని 30 లక్షల సహకార సంఘాల్లో వంద కోట్లమందికిపైగా సభ్యులున్నారని అంతర్జాతీయ సహకార సంఘాల కూటమి (ఐసీఏ) తెలిపింది. ప్రపంచ శ్రామికశక్తిలో పది శాతంమంది సహకార సంఘాల సిబ్బందే. 300 అతిపెద్ద సహకార సంఘాలు 2.41 లక్షల కోట్ల డాలర్ల టర్నోవర్ సాధించాయి. ప్రపంచ సహకార సంఘాల మానిటర్–2023 నివేదిక ప్రకారం 300 అగ్రశ్రేణి అంతర్జాతీయ సహకార సంఘాల్లో అత్యధికం అమెరికా, ఐరోపా దేశాల్లోనే ఉన్నాయి. అగ్రశ్రేణి సహకార సంఘాల్లో భారత్‌కు చెందినవి 15 ఉన్నాయి. తలసరి జీడీపీతో పోలిస్తే అత్యధిక టర్నోవర్ సాధించిన ఘనత–అమూల్, ఇఫ్‌కోలదే. వీటితోపాటు క్రిభ్‌కో కూడా అంతర్జాతీయ జాబితాలో ఉంది. రానున్న అయిదేళ్లలో భారత జీడీపీకి సహకార రంగం నుంచి 3–4శాతం వాటా సమకూరవచ్చు. 5.6 కోట్ల స్వయంఉపాధి అవకాశాల సృష్టి జరిగే వీలుంది.

అపూర్వ విజయాలు

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మన ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికీ, అందులో కీలకమైన సహకార సంఘాలకూ ప్రాధాన్యం ఇస్తున్నాయి. జాతీయ పాడి అభివృద్ధి బోర్డు (ఎన్‌డీడీబీ), జాతీయ సహకార అభివృద్ధి సంస్థ, నాఫెడ్ వంటి సంస్థలను స్థాపించి సహకార రంగాన్ని బలోపేతం చేశాయి. ఎన్డీయే సర్కారు 2021లో కేంద్రంలో సహకారశాఖను ఏర్పాటు చేసింది. 2002 నాటి జాతీయ సహకార విధానం స్థానంలో 2025లో కొత్త విధానాన్ని వెలువరించింది. 'సహకార్ సే సమృద్ధి' సాధన ద్వారా 2047కల్లా వికసిత భారతాన్ని అందుకోవాలని లక్షిస్తోంది. నిబద్ధత, నిజాయతీ మూర్తీభవించిన నాయకుల సారథ్యంలో సహకార సంఘాలు అపూర్వ విజయాలు సాధించగలవని అమూల్ ఇప్పటికే నిరూపించింది. పాడి రంగంలో అమూల్ సాధించిన విజయాలను వ్యవసాయం, ఉద్యాన పంటలు, మత్స్య పరిశ్రమ వంటి రంగాల్లోనూ సాధించాలి. తద్వారా గ్రామీణుల ఆదాయాలను పెంచాలి. అమూల్ విప్లవం నందిని, మదర్ డైరీ వంటి సహకార సంఘాలకు దారిదీపమైంది. తెలంగాణలోని ముల్కనూరు డైరీ కోఆపరేటివ్ దేశంలో మహిళల సారథ్యంలోని మొట్టమొదటి పాడి సహకార సంఘంగా రికార్డులకెక్కింది. తిరుపతిలోని శ్రీజ మహిళా పాడి సహకార సంఘం ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా సంస్థగా ఖ్యాతికెక్కింది. 36వేల భారతీయ సహకార సంఘాల కూటమి అయిన ఇఫ్కో దేశవ్యాప్తంగా 5.5 కోట్లమంది రైతులకు మేలైన ఉత్పత్తి సాధనాలను అందిస్తూ లాభాలు పండిస్తోంది. నానో యూరియా, నానో డీఏపీలనూ అందిస్తోంది. మహారాష్ట్రలోని వారానా కోఆపరేటివ్ కాంప్లెక్స్ చక్కెర రంగంతో మొదలుపెట్టి పాడి, విద్య, బ్యాంకింగ్ రంగాలకూ విస్తరించింది. మహారాష్ట్రలోని చక్కెర సహకార సంఘాలు లక్షలమందికి జీవనోపాధి కల్పిస్తున్నాయి. అక్కడి జల సహకార సంఘాలు నీటిని పొదుపుగా వాడి ఎక్కువ దిగుబడులు సాధిస్తున్నాయి. పాడి రంగంలో అమూల్ స్థాయిలో ఉద్యాన పంటల రంగంలో మహారాష్ట్రకు చెందిన సహ్యాద్రి ఫామ్స్ విరాజిల్లుతోంది. దీంట్లో సభ్యులైన 30వేలమంది రైతులు 40వేల ఎకరాల్లో పండ్లూకూరగాయలు పండించి నలభైకి పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. తెలంగాణలో 1956లో ప్రారంభమైన ముల్కనూరు గ్రామీణ రుణ, మార్కెటింగ్ సొసైటీ 14 గ్రామాలకు ఆశాజ్యోతిగా మారింది. ఈ సంఘంలోని ఏడువేల మంది పైచిలుకు రైతుల్లో ఏ ఒక్కరూ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోలేదు. సేవా కోఆపరేటివ్ ఫెడరేషన్ 18 రాష్ట్రాల్లో 32 లక్షల మహిళా కార్మికులను సంఘటితం చేసి వారి భవితను మార్చింది. కేరళలోని ఉరళుంగల్ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ 7500 ప్రాజెక్టులు పూర్తిచేసి, యూఎన్‌డీపీతో ఆదర్శ సంఘంగా గుర్తింపు పొందింది. కేరళ త్రిస్సూరులోని ఇండియా కాఫీ హౌస్ ఛత్రం కింద కార్మికుల సహకార సంఘాలు దేశమంతటా సుమారు 500 రెస్టారెంట్లను నడుపుతున్నాయి. 1959లో ఏడుగురు మహిళలు ముంబయిలో ప్రారంభించిన లిజ్జత్ పాపడ్ నేడు 45వేల మంది స్త్రీలతో అప్పడాలు, పచ్చళ్లు, మసాలాలను తయారు చేయిస్తూ మహిళా సాధికారతను సాధిస్తోంది. కొన్ని సహకార సంఘాలు బడా కంపెనీలకే పోటీ ఇవ్వగలుగుతున్నాయి. సహకారంతో సమృద్ధి సాధించవచ్చని నిరూపిస్తున్నాయి.

వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు

ప్రభుత్వం గడచిన అయిదేళ్లలో పంచాయతీకి ఒకటి చొప్పున సహకార సంఘాల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలను డిజిటలీకరించింది. దేశంలోని మొట్టమొదటి సహకార ట్యాక్సీ సర్వీసు 'భారత్ ట్యాక్సీ'కి ప్రోత్సాహం కల్పిస్తోంది. ప్రభుత్వ ఈ–మార్కెట్లలో కొనుగోలుదారులుగా సహకార సంఘాలను అనుమతించింది. వ్యవసాయ సరకుల ఎగుమతులను పెంచడానికి 2023లో నెలకొల్పిన జాతీయ సహకార ఎగుమతుల లిమిటెడ్ సంస్థలో 11,034 సంఘాలు సభ్యులుగా ఉన్నాయి. ఈ సంస్థ 28 దేశాలకు రూ.5,403 కోట్ల విలువైన వ్యవసాయ సరకులను ఎగుమతి చేసింది. రైతుల ఆదాయాలను రెట్టింపు చేయడానికి తోడ్పడుతోంది. తెలంగాణలో 48వేల సహకార సంఘాలు క్రియాశీలంగా ఉండగా, ఏపీలో 12,690 చురుగ్గా పనిచేస్తున్నాయి. తెలంగాణలో పాడి, వ్యవసాయ, రుణ సహకార సంఘాలదే పైచేయి. ఏపీలో ఆక్వా, పాడి, ఆహార శుద్ధి, ఉద్యాన పంటల సంఘాలు క్రియాశీలంగా ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలు వివిధ రంగాల్లో అమూల్ తరహా సహకార సంఘాలను నెలకొల్పాల్సిన అవసరం ఉంది. మహిళలు, యువతకు ప్రాధాన్యమిస్తూ నవీకరణ పథంలో పరుగులు తీయడం ద్వారా భారతీయ సహకార సంఘాలు ప్రపంచస్థాయిలో నిలవాలి.

# ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక బీహార్‌లో ఓటర్ల నమోదు జరిగిందా?



పాట్నా:బీహార్‌లో ఎన్నికలు ముగిసిన తర్వాత ఎన్నికల సంఘం ప్రకటించిన తాత్కాలిక వివరాల ప్రకారం రాష్ట్రంలో ఎన్నికల సమయానికి 7,41,92,357 మంది ఓటర్లు ఓటర్ల లెక్కింపు తర్వాత 7,45,26,858 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల సంఘం ప్రకటించింది. సెప్టెంబరు 30 నాటికి వివాదాస్పదమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పూర్తి అయ్యింది. అక్టోబరు 6న ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యింది. ఈ పరిస్థితుల్లో అదనంగా లెక్కలోకి వచ్చిన మూడులక్షల పైచిలుకు ఓట్లు ఓటర్ల జాబితాలోకి ఎలా స్మగులయ్యాయి అన్నది దేశం సమాధానం తెలుసుకోవాలనుకుంటున్న ప్రశ్న.అయితే, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ మాత్రం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే సందర్భంలోనేబీ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ క్రమంలో ఎవరి పేర్లయినా నమోదుకాలేదని భావిస్తే, వాళ్లు పోలింగ్‌కు పది రోజుల ముందు లోపు ఓటు నమోదు చేయించుకోవచ్చని తెలియజేసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఓటర్ల జాబితా ఫ్రీజ్ అవుతుంది. ఇప్పటి వరకూ ఏ ఎన్నికల్లోనూ ఇలా పోలింగ్‌కు పది రోజుల వరకూ ఓటర్ల నమోదు కార్యక్రమం కొనసాగలేదు. ఈ సారి బీహార్‌కు మాత్రం ఎన్నికల సంఘం ఆ వరం ఇచ్చింది. దీనిపై చట్టబద్ధమైన ప్రశ్నలు, సాధారణ ప్రజల సందేహాలు ఉన్నాయి.ఈ ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశ్కెలి కూడా 2024 లోక్సభ ఎన్నికల నాటి వ్యవహారశ్కెలినే పోలి ఉంది. ఓటింగ్ పూర్తి అయిన తర్వాత ఓ గంట వ్యవధిలో మొత్తం పోల్కైన ఓట్లు ఎన్నో రిటర్నింగ్ అధికారి ద్వారా రాష్ట్ర ఎన్నికల సంఘానికి, తద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి చేరే అవకాశం ఉంది. కానీ ఎన్నికల సంఘం మాత్రం పోల్కైన ఓట్ల సంఖ్యను చెప్పకుండా ఎంత శాతం పోలింగ్ జరిగిందో చెప్పి ఊరుకుంటుంది. అప్పటికి పోస్టల్ బ్యాలెట్ల లెక్క తేలే అవకాశం లేదు కాబట్టి, ఈ పోల్కైన ఓట్ల సంఖ్యలో మార్పులకు అవకాశం ఉంటుంది. ఈ వ్యవహారశ్కెలి పైనే పౌర సమాజం చివరకు సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది.

అలా ఎలా సాధ్యం?

పోలింగ్ ముగిసిన తర్వాత రాష్ట్రంలో 66.91 శాతం ఓట్లు పోలయ్యాయని, 1951 ఎన్నికల తర్వాత ఇదే అత్యధిక పోలింగ్ శాతమని ఎన్నికల సంఘం జారీ చేసిన ప్రకటనలో తెలిపింది. ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, రెండు దశల పోలింగ్ ముగిసే సమయానికి రాష్ట్రంలో 37513302 మంది మహిళా ఓటర్లుబీ 37013556 మంది పురుషులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అంటే మొత్తం 74526858 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. కానీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే నాటికి 7,41,92,357 మంది మాత్రమే ఓటర్లుగా ఉన్నారని ప్రకటించిన విషయాన్ని ఎన్నికల సంఘం మర్చిపోయిందా?లేక ఎన్నికల సంఘం ప్రకటించినట్లుగా ఓటర్ల జాబితాలో తమ పేరు కనిపించకపోతేబీ వారు పోలింగ్‌కు పది రోజుల ముందు వరకూ తమ పేరును జాబితాలో చేర్చుకునేందుకు వీలు కల్పించారు కాబట్టి, కనీసం పోలింగ్‌కు పదిరోజుల ముందు ఓ ప్రకటన జారీ చేసి ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకుని, ఎంత మంది అదనపు ఓటర్లు తమ ఓటు హక్కు తిరిగి పొందారో వివరించి ఉండాల్సింది. కానీ అటువంటి ప్రకటన ఎక్కడా జారీ కాలేదు. కానీ పోలింగ్ పూర్తయ్యే సరికి మూడులక్షల పై చిలుకు అదనపు ఓటర్లు పుట్టుకొచ్చారు. ఇది ఎలా సాధ్యం? అంటే ఎన్నికల సంఘమే దొంగ ఓటర్ల కసరత్తులో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భాగస్వామిగా మారిందానే సందేశాలు ఈ వ్యవహారశ్కెలిని బట్టే తలెత్తుతాయి.ది క్వింట్ వార్త సంస్థ అందించిన కథనం ప్రకారం ఈ పెరిగిన ఓట్లు అత్యధికంగా గయ జిల్లాలో ఉన్నాయి. తర్వాత రోహతస్ జిల్లా ఈ విషయంలో రెండో స్థానంలో నిలిచింది. గయలో 20456 మంది అదనపు ఓటర్లు తోడుకాగా, రోహతాస్ జిల్లాలో 20030 మంది, బోజ్‌పూర్‌లో 17930 మంది, పశ్చిమ చంపారన్‌లో 16649 మంది, పునియా జిల్లాలో 15639 మంది ఓటర్లు అదనంగా లెక్కకొచ్చారు. ఈ ఐదు జిల్లాల్లో 40 నియోజకవర్గాలు ఉంటే, అందులో 35 నియోజకవర్గాల్లో ఎన్డీయే గెలిచింది. స్థూలంగా చూసినప్పుడు మొత్తం రాష్ట్రంలో 10 నియోజకవర్గాల్లో గెలిచిన అభ్యర్థికి, ఓడిన అభ్యర్థికి మధ్య ఉన్న తేడా కంటే కొత్తగా చేరిన ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితుల్లో అకస్మాత్తుగా పెరిగిన ఓటర్ల సంఖ్యకు, పాలకపక్షం గెలుపుకు మధ్య సంబంధం ఉందా లేదానే ప్రశ్న పరిశీలకులకు తలెత్తటం సహజం.

# అంతర్జాతీయ వామపక్ష రాజకీయాల పునరోదయం..



కొన్ని సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో అంతర్జాతీయ రాజకీయాలలో మితవాద/మత/ దక్షిణ పక్ష ప్రభావం ఆధిపత్యం వహిస్తున్నది. అయినాగాని అభ్యుదయాత్మక వామపక్ష రాజకీయాల ఉత్తేజపూరిత పునరుజ్జీవం కొనసాగుతున్నదని గమనించదగిన సంఘటనల క్రమం సూచిస్తున్నది. న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ క్వామే మమ్దానీ ఎన్నిక, ఐర్లాండు అధ్యక్షురాలిగా కేథరీన్ కొన్నోలీ ఎంపిక, నెదర్లాండులో రాబ్ జెట్టెన్ ఉదారవాద మధ్యేవాద పార్టీ డీ66 విజయానికిదారి తీయడమనేవి ఈ ధోరణికి ఉదాహరణ.అమెరికా శతకోటీశ్వరులు, అధ్యక్షుడు ట్రంప్ అండగా నిల్చిన ఆండ్రూ క్యూమోను భారీ ఓట్ల తేడాతో న్యూయార్క్ మేయర్ ఎన్నికలో మమ్దానీ ఓడించారు. అమెరికాలో అతిపెద్ద సుసంపన్న నగరంలో డెమోక్రాటిక్ పార్టీలోని సామ్యవాద బృందానికి నాయకుడైన మమ్దానీ విజయం చరిత్ర సృష్టించింది.ఐర్లాండు అధ్యక్ష ఎన్నికల్లో కేథరీన్ కొన్నోలీ నిర్ణయాత్మక విజయం సాధించగా, నెదర్లాండు(డచ్) పార్లమెంటుకు గల 150 సీట్లలో జెట్టన్ నాయకత్వంలో డీ66 అతిమితవాద పార్టీ– పార్టీ ఫర్ ఫ్రీడమ్‌ను(పీవీవీ) అధిగమించింది.ఇటలీ, హంగరీ, ఫిన్లాండు, సెర్బియా, స్విజ్జర్లాండు, బ్రిటన్, జర్మని, ఫ్రాన్స్, స్పెయిన్‌లలో యూరపు అంతటా మితవాద రాజకీయాలు ఊపందుకున్నాయి. అయినాగాని న్యూయార్క్, ఇంగ్లాండు, నెదర్లాండుల మూడు విజయాలు మినహాయింపులుగా నిలుస్తున్నాయి. ప్రజలందరినీ కలుపుకుని పోయే అభ్యుదయకరమైన రాజకీయాలు ప్రతిధ్వనిస్తున్నాయనే దాన్ని ఇవి పునరుద్ఘాటిస్తున్నాయి.

న్యూయార్క్ ప్రజల తీర్పు

ఈ ప్రజానుకూల మార్పును మమ్దానీ సంక్షిప్తంగా వ్యక్తీకరించారు. ఆశావాహమైన తన సంక్షేమ కార్యక్రమాల కోసం శత కోటీశ్వరులు, కార్పోరేట్లపై అదనంగా 2 శాతం పన్నులు విధించాలని ప్రతిపాదించారు. ప్రతి 24 మందిలో ఒకరు కోటీశ్వరుడిగా ఉన్న నగరంలో ఇది కొట్టొచ్చినట్టుండే ఆలోచన. ఆర్థిక న్యాయం కేంద్రంగా సంక్షేమ వ్యతిరేరకత, వలస వ్యతిరేకత, ముస్లిం వ్యతిరేకత ఏదైతే ట్రంపిజం లక్షణాలుగా ఉన్నాయో వాటన్నింటి వ్యతిరేకిస్తూబీ తను ప్రచారం నిర్వహించారు. పెరుగుతోన్న అద్దెలు, ద్రవ్యోల్బణం, బిడ్డల సంక్షేమం, ఆరోగ్య భద్రతవంటి కీలక జీవితావసరాలను తను ఓటర్ల ముందు పెట్టాడు. అతను చేసిన వాగ్దానాలు:

–మూడు సంవత్సరాల అద్దె స్తంభింపచేయటం

– పెరిగిన ఇంటి అద్దెల వల్ల నగరం బయటకు నెట్టివేయబడిన కార్మికులకు ఉచిత, వేగవంతమైన బస్సు సదుపాయం.

–బడికి వెళ్లే పిల్లలకు ఉచిత సంరక్షణ

– ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వ నియంత్రణలో దుకాణాలు%–% ఎంపిక చేసిన ప్రదేశాల్లో ఏర్పాటు– వాటిని విస్తరించడం రోజుకి కనీసం 30 డాలర్ల చొప్పున కనీస వేతన పెంపుదల.

వలస, కస్టమ్స్ అమలు వ్యవస్థలతో వలసలపై దాడిని ట్రంపు తీవ్రతరం చేసిన సమయంలోనేబీ తనను తాను "వలస వచ్చిన ముస్లిం"గా మమ్దానీ బహిరంగంగా ప్రకటించి, ఓటర్లను నేరుగా విజ్ఞప్తి చేశారు. దీంతో ఉద్దేశ్యపూర్వకంగానే విభిన్నమైన ఓటర్లతో అనుసంధానించుకోగలిగారు.(మమ్దానీ పుట్టుకతో భారతీయుడు. ఉగాండా నుంచి వలస వెళ్లాడనేది గమనార్హం) విజయం సాధించినాక మొదటి ఉపన్యాసంలో అందరిని కలుపుకునే తన దృష్టిని "ఈ నగరం వలస వచ్చిన వారిది, వలస వచ్చినవారు నిర్మించిన, వలస వచ్చిన వ్యక్తి నాయకత్వం వహించేది" అని చెప్పడం ద్వారా ప్రకటించారు.

గాజా నరమేధాన్ని ఖండించడంలోగానిబీ ఇజ్రాయిలు ప్రధాని బెంజిమన్ నేతన్యాహూను యుద్ధ నేరస్తుడని ప్రకటించడంలోనూ తను ఎంతమాత్రం సంశయించలేదు. డెమోక్రటిక్ పార్టీ ఇజ్రాయిలు నిర్ణయాలకు మద్దతుకొనసాగిస్తున్నప్పటికీ, మమ్దానీ పాలస్తీనా కోసం బలంగా నిలబడ్డాడు. అతని ఈ నిశ్చయం అమెరికా రాజకీయాలలో ఒక పదునైన నైతిక భిన్నత్వంగా వర్ణించవచ్చు.మూడోసారి కూడా అధ్యక్షుడు కావాలనే కోరికను ట్రంప్ వ్యక్తపరిచిన సమయంలోనేబీ న్యూయార్క్ మేయరు పదవి, న్యూజెర్సీ, వర్జినియా గవర్నరు పదవులను భారీగా గెల్చుకుని, గమనార్హంగా రిపబ్లికన్ పార్టీని డెమోక్రటిక్ పార్టీ నేతలు వెనక్కు నెట్టారు.ట్రంపిజానికి హెచ్చరికగానూబీ అభ్యుదయ రాజకీయాలకు ఆశాదీపంగానూ ఈ నిమిషం నిలబడుతుంది.

యూరపులో వ్యతిరేక పవనాలు..

యూరోపు అంతటా కూడా మితవాద శక్తులు ముందుకు వస్తున్నా కొద్దీ దాని వ్యతిరేక ఉద్యమాలు ఉద్భవించసాగాయి. ప్రత్యేకించి ఐర్లాండు, నెదర్లాండు పరిణామాలు గమనించదగినవి. అక్టోబరు ఎన్నికల్లో చెక్ రిపబ్లిక్‌లో అతి మితవాద పార్టీ అతిపెద్ద రాజకీయశక్తిగా మారింది. ఇటలీ, హంగరీ, ఫిన్లాండు సెర్బియా, స్విజ్జర్లాండులలో అతిమితవాద పార్టీలు అప్పటికే అధికారంలో ఉన్నారు. బ్రిటనులో తీవ్రమితవాద నాయకుడు టామీ రాబిన్సన్ డ్ర్యా తీసిన ఊరేగింపులో దాదాపు లక్షాయాభై వేలమది పాల్గొన్నారు. జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్‌లలో ఎఎఫ్‌డీ, నేషనల్ ర్యాలీ వోక్సో వంటికి బాగా చొచ్చుకుపోతున్నాయి. ఈ ప్రతికూల నేపథ్యంలో 68 ఏళ్ల కేథరీన్ కొన్నోలీ ఐర్లాండులో, నెదర్లాండులో రాబ్ జెట్టెన్ ఇద్దరూ– వామపక్ష రాజకీయాలు ముందుకు తీసుకు వెళ్తున్నవాళు సాధించిన విజయాలు ఎన్నదగినవి.45.8శాతం పోలైన మొత్తం ఓట్లల్లో 64.6% ఓట్ల కేథరీన్ కొన్నోలీ సాధించారు. సాంప్రదాయిక ఫైన్ గేల్ అభ్యర్థి, పూర్వ మంత్రి హీథర్ హంఫ్రీస్ 27% ఓట్లు పొందారు. ఫియాన్నా ఫైల్ అభ్యర్థి జిమ్ గావిన్‌కి కేవలం 8.4% ఓట్లు వచ్చాయి. అంటే ఈ ఇద్దరి ఓట్ల మొత్తం కంటే రెట్టింపు ఓట్లు కేథరీన్ కొన్నోలీకి లభించాయి.తీవ్ర మితవాద పార్టీ అభ్యర్థిని నిలపలేదు. దాని మద్దతుదార్లు నిరసన ప్రకటించడానికిగాను వారు ఓట్లు పాడు చేశారు. ఏ పెద్ద రాజకీయ పార్టీకి అనుబంధంగాలేని కేథరీన్ కొన్నోలీ ఈ మితవాద వ్యతిరేక ఓట్లన్నీ ఒకే జెండా కిందికి తేగలిగింది.లేబరు, గ్రీన్స్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఐర్లాండు, పీపుల్ బిఫోర్ ప్రాఫిట్, 100% రెడ్(డెనిగల్ ఆధారిత ఉద్యమం) సోషలిస్టు డెమోక్రాటిక్ పార్టీ, వర్కర్స్ పార్టీ, సిన్ ఫెయిన్, ట్రేడ్ యూనియన్లు, సాంస్కృతిక సంఘాలు, భాషా కార్యకర్తలు యుద్ధ వ్యతిరేక బృందాలవంటివన్ని కలసిన విశాల కూటమి ఆమె విజయంలో కారణంగా ఉంది. బ్రిటిష్ వలస పాలనలో విభజించబడిన ఐర్లాండు ఐక్యం కావాలనే పిలుపు సుదీర్ఘకాలంగా కొనసాగిస్తున్న సిన్‌ఫియన్ మద్దతు తెల్పడం ప్రత్యేకంగా పేర్కొనవలసిన విషయం.ఉత్తర ఐర్లాండు బ్రిటను ఆధీనంలో ఉంది. అక్కడి జనాభాలో సగం మంది ప్రజలకు ఐరిష్ పౌరసత్వం ఉంది. గాజాపై ఇజ్రాయిలుదాడులకు వ్యతిరేకంగా యూరపులో వినిపించే ఒక బలమైన గొంతుక ఐర్లాండు. యూరోపియన్ యూనియన్, అమెరికా, ఇజ్రాయిల్‌తో పాటు నిలబడ్డప్పుడు ఐర్లాండు అత్యంత భావోద్వేగభరితమైన ప్రదర్శనలను చవి చూసింది. కేథరీన్ కొన్నోలీ ఈ ప్రదర్శనల్లో పాల్గొనడమే కాదు. ఇజ్రాయిలును ఉగ్రరాజ్యంగా ప్రకటించింది కూడా. చరిత్ర అక్టోబరు 7తో మొదలు కాలేదని ఆమె బలంగా ప్రపంచానికి గుర్తుచేసింది. చివరి ఊపిరి వరకూ కూడా పాలస్తీనా ప్రజలతో పాటే ఉంటానని ఆమె ప్రతిజ్ఞ చేసింది.ఐర్లాండు నాటోలో మిలటరీ ఒప్పందాలు పెంచుకోవడాన్ని ఆమె వ్యతిరేకించింది. నాటోకు, ఆయుధ వ్యాపారానికి వ్యతిరేకంగా ఆమె ఖచ్చితంగా నిలబడడం ఆమెకు ఓటర్ల విశ్వసనీయత మరింత పెరిగింది.

డచ్ పురోగతి..

నెదర్లాండులో గీర్ట్ వైల్డర్స్ నేతృత్వంలో తీవ్ర మితవాద పీవీవీ ప్రభుత్వం ఒక ఏడాది పాటు అధికారంలో ఉంది. దాని కఠోరమైన వలస వ్యతిరేక విధానాల వలన పెరుగుతోన్న ఒత్తిడి కారణంగా జూన్‌లో పతనమయ్యింది. 2023 కంటే తక్కువగా ఈసారి పీవీవీ కేవలం 26 సీట్లు గెలిచింది. 1966 ఏర్పడిన లిబరల్ డెమోక్రాటిక్ పార్టీ డీ66 తొమ్మిది స్థానాల నుంచి 27 సీట్లు గెలిచి నాటకీయంగా పునఃప్రవేశం చేసింది. 38 సంవత్సరాల నాయకుడు రాబ్ జెట్టిన్ పీవీవీ మినహాయించి మిగిలిన పార్టీలతో సంప్రదింపులు జరుగుతున్నారు. ఆ కూటమిలో అతను ప్రధాని అవుతారు.నెదర్లాండులో కూటమి ఏర్పాటుకు అనేక నెలలు పడుతుంది. అది ఫలవంతమైతే జెట్టిన్ డచ్ చరిత్రలోఅతి పిన్న వయస్కుడు, తొలి స్వలింగ సంపర్కుడైన ప్రధాని అవుతారు. ఇది తీవ్రమిత వాదానికి ఎదురుదెబ్బ. యూరపులో అభ్యుదయ కలుపుకు పోయే రాజకీయాలకు ఆమోదానికి నిర్ధారణకూడా.

# కేంద్రం దెబ్బతో దిగివచ్చిన మావోలు

విజయవాడ,వరుస ఎనకౌంటర్లు, లొంగుబాట్లు, ఆపరేషన్ కగార్‌ల నేపథ్యంలో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిజానికి 90శాతం దెబ్బతినట్లుగానే భావించాలి. ఈ క్రమంలోఆయుధాలను వీడటంపై మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే ఆయుధాలను వదిలే తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆ మూడు రాష్ట్రాల సీఎంలకు విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి అనంత్ పేరిట బహిరంగ లేఖ విడుదలైంది. దేశం, ప్రపంచంలో మారుతున్న పరిస్థితులను అంచనా వేస్తూ ఆయుధాలు త్యజించడం ద్వారా సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని మా పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సోను దాదా ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని మేం సమర్థిస్తున్నాం. కేంద్ర కమిటీ సభ్యులు సతీశ్ దాదా, చంద్రన్న ఇటీవల ఈ నిర్ణయాన్ని సమర్థించారు. ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ సైతం తుపాకులను వదిలేయాలని భావిస్తోంది. అయితే మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు మాకు ఫిబ్రవరి 15 వరకు సమయం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాం. ప్రజాస్వామ్య కేంద్రీకరణ సూత్రాలకు మా పార్టీ కట్టుబడి ఉన్నందున ఈ నిర్ణయాన్ని సమష్టిగా చేరుకునేందుకు మాకు కొంత సమయం పడుతుంది. మా సహచరులను సంప్రదించి పద్ధతి ప్రకారం వారికి ఈ సందేశాలు తెలియజేసేందుకు సమయం కావాలి. ఇంత సమయం అడిగేందుకు ఇతర ఉద్దేశాలేమీ లేవు. త్వరగా కమ్యూనికేట్ చేసేందుకు మాకు వేరే సులభ మార్గాలు లేనందున ఈ వ్యవధిని కోరుతున్నాం. భద్రతా బలగాలు తమ కార్యకలాపాలు నిలిపివేయాలి. పీఎల్‌జీఏ వారోత్సవాన్ని నిర్వహించబోం. మా అన్ని కార్యకలాపాలను నిలిపివేస్తామని హామీ ఇస్తున్నాంఅని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయుధ విరమణపై మావోయిస్టు పార్టీ కీలక ప్రకటన చేసింది. ఆయుధాలు వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే అప్పటి నుంచి ఆయుధాలను వదిలేస్తామని ప్రకటించింది. ఇప్పటికే బస్వరాజు ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీ పునర్‌నిర్మాణం, వ్యూహాత్మక మార్పులు అవసరమని గుర్తించి ఆయుధ విరమణపై ప్రకటన చేస్తామని లేఖలో పేర్కొంది. సీసీఎంలో తీసుకున్న నిర్ణయం మేరకు జోనల్ కమిటీలకు సమాచారం ఇచ్చినట్టు మావోయిస్టు పార్టీ లేఖలో వెల్లడించింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో ఇంకా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతాదళాలు అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే మావోయిస్టు పార్టీ ఈ మేరకు లేఖను విడుదల చేసింది. మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు, డీజీపీలు దీనిపై కీలక నిర్ణయం తీసుకుంటే కచ్చితంగా ఆయుధాలు వదిలేస్తామని మావోయిస్టు పార్టీ చెప్పింది. దీంతో ఈ లేఖపై మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నాయో చూడాల్సి ఉంది.

# భగ్గుమన్న ఆప్-కాంగ్రెస్ పార్టీలు

చండీగఢ్ :చండీగఢ్ కేంద్రంగా కొత్త రాజకీయాలు మొదలయ్యాయా? ఆ ప్రాంతాన్ని ఆర్టికల్ 240 తేవాలని కేంద్రం ఆలోచన చేస్తోందా? శీతాకాల సమావేశాల్లో బిల్లు తేవాలని ప్లాన్ చేసిందా? కేంద్రం నిర్ణయాన్ని అధికార ఆప్, విపక్ష కాంగ్రెస్ పార్టీలు తప్పుబడుతున్నాయా? ఈ నేపథ్యంలో కేంద్రం ఎలాంటి అడుగులు వేయనుంది? ఉత్తరాదిలో ఇప్పుడు దీనిపై చర్చ మొదలైంది.

చండీగఢ్ చుట్టూ కొత్త రాజకీయాలు

పంజాబ్–హర్యానా రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధాని చండీగఢ్. అయితే చండీగఢ్ పాలనా బాధ్యతలను పంజాబ్ గవర్నర్ అడ్మినిస్ట్రేటర్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే చండీగఢ్ ప్రాంతాన్ని ఆర్టికల్ 240 కిందకు తీసుకురావాలని భావిస్తోంది కేంద్రప్రభుత్వం. అదే చేస్తే ఆ ప్రాంతంపై పంజాబ్ గవర్నర్ పాత్ర బలహీనపడుతుందని అక్కడి ప్రభుత్వం ఆలోచన. ఆ ప్రాంతంపై రాష్ట్రపతి నియంత్రణ పెరుగుతుందని అంచనా వేస్తున్నాయి రాజకీయ పార్టీలు.చండీగఢ్ అధికారంపై డిసెంబర్‌లో జరగనున్న శీతాకాల సమావేశాల్లో బిల్లు తీసుకురావాలని కేంద్రం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కేంద్రం నిర్ణయంపై పంజాబ్‌లోని అధికార–విపక్షాలు భగ్గుమన్నాయి. ఇది ముమ్మాటికీ పంజాబ్ ప్రయోజనాలకు విరుద్ధమని తెగేసి చెబుతున్నాయి. చండీగఢ్ అధికారాలను పంజాబ్ నుంచి తొలగించేందుకు మోదీ సర్కార్ ఈ స్కెచ్ వేసిందని అంటున్నాయి.

కేంద్రం ప్రతిపాదనపై ఆప్–కాంగ్రెస్–అకాలీదల్ పార్టీలు ఆగ్రహం

చండీగఢ్ పరిపాలనా స్వరూపాన్ని మార్చేందుకు కేంద్రం రాజ్యాంగ సవరణ ప్రతిపాదన చేయనుంది. దీనికి సంబంధించి 131వ రాజ్యాంగ సవరణ బిల్లు–2025ను పార్లమెంటులో ప్రవేశపెట్టాలని భావిస్తోంది. దీనివల్ల చండీగఢ్‌ను రాజ్యాంగంలోని ఆర్టికల్ 240 పరిధిలోకి తీసుకు రావాలని భావిస్తోంది. ఆర్టికల్ 240 ప్రకారం రాష్ట్రపతికి అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, డామన్ అండ్ డయ్యూ కేంద్ర పాలిత ప్రాంతాల మాదిరిగా చండీగడ్‌పై నేరుగా నిబంధనలను రూపొందించే అధికారం దక్కనుంది.కేంద్ర ప్రభుత్వం నిర్ణయంపై భగ్గుమన్నారు పంజాబ్ సీఎం భగవంత్ మాన్. పంజాబ్ రాజధానిని లాక్కోవడానికి కేంద్రం కుట్ర చేస్తోందని విమర్శించారు. చండీగఢ్ నిత్యం పంజాబ్‌లో అంతర్భాగంగా ఉంటుందన్నారు. చండీగఢ్ నిర్మాణానికి మా గ్రామాలను ధ్వంసం చేశారని, దానిపై హక్కు కేవలం మాకు మాత్రమే ఉంటుందని తేల్చిచెప్పారు. దీనిపై వెనక్కి తగ్గేది లేదన్నారు. పంజాబ్‌లోని అధికార ఆప్, విపక్ష కాంగ్రెస్, శిరోమణి అకాలీదల్ పార్టీల నేతలు ఇందుకు ససేమిరా అంగీకరించేది లేదని అంటున్నారు. ఈ సవరణను పంజాబ్ ప్రభుత్వం అనుమతించదని తేల్చేశారు.పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా కేంద్రం ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. చండీగఢ్ పంజాబ్‌కు చెందినది, దానిని లాక్కోవడానికి చేసే ఏ ప్రయత్నమైనా తీవ్ర పరిణామాలను కలిగి ఉంటుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అలాంటి దుస్సాహసం చేయకూడదన్నారు.శిరోమణి అకాలీదల్ అధికార ప్రతినిధి దల్జిత్ సింగ్ చీమా ఖండించారు. కేంద్రం ప్రతిపాదనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశం శ్రీ గురు తేజ్ బహదూర్ సాహిబ్ 350వ అమరవీరుల వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సమయంలో కేంద్రం.. పంజాబ్ నుండి చండీగఢ్‌ను వేరు చేయడానికి కుట్ర పన్నుతుందని ఎప్పుడూ ఊహించలేదన్నారు.ఆప్–కాంగ్రెస్–అకాలీదల్ నేతల వాదనను తోసిపుచ్చింది పంజాబ్ బీజేపీ. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ అన్నారు. చండీగఢ్‌ను పూర్తి కేంద్రపాలిత ప్రాంతంగా చేయడం, ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేస్తుందని పేర్కొన్నారు. పంజాబ్ పరిపాలనలో పెట్టుబడిదారులు అనిశ్చితంగానే ఉన్నారని పేర్కొన్నారు. యూటీ హోదాతో కేంద్రం నుంచి నిధులు తీసుకురావడానికి, అభివృద్ధి ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేయడానికి వీలు కల్పిస్తుందన్నారు.

## స్మృతి మంధాన తండ్రి క్షేమం

న్యూఢిల్లీ, భారత మహిళా స్టార్ ప్లేయర్ స్మృతి మందాన వివాహం చివరి నిమిషంలో వాయిదా పడింది. మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ తో స్మృతి వివాహం ఆదివారం సాయంత్రం జరగాల్సి ఉండగా అనూహ్యంగా వాయిదాపడింది. ఉదయం ఆమె తండ్రి శ్రీనివాస్ మందాన గుండెపోటుకు గురయ్యారు. దీంతో పెళ్లి వాయిదా పడింది. ఈ షాక్ లో ఉన్న స్మృతికి మరో షాక్ తగిలింది. ఆమెకు కాబోయే భర్త పలాశ్ కూడా అనారోగ్యానికి గురయ్యారు. పలాశ్ ముచ్చల్ వైరల్ ఇన్ఫెక్షన్‌కు గురయ్యారు.

# మరోమారు కుత్సిత బుద్ధిని చాటుకున్న చైనా

న్యూఢిల్లీ,చైనా మరోమారు తన కుత్సిత బుద్ధిని చాటుకుంది. అరుణాచల్ తమదే అన్న వాదన కోసం ఏ చిన్న అవకాశం దొరికినా వదలడం లేదు. తాజాగా ఇలాంటి ఘటన కలకలం రేపింది.చైనాలో షాంఘై పుడాంగ్ విమానాశ్రయంలో భారత మహిళకు వేధింపులు ఎదురయ్యాయి. అరుణాచల్ ప్రదేశ్ చైనాదే అంటూ తన భారత పాస్‌పోర్ట్‌ను గుర్తించేందుకు ఆ దేశ అధికారులు నిరాకరించారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈనెల 21న పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ అనే మహిళ లండన్ నుంచి జపాన్‌కు వెళ్లే విమానం ఎక్కారు. అయితే ట్రాన్సిట్ హాల్ట్ కోసం అది చైనా నగరం షాంఘైలో దిగింది. అక్కడ తన పాస్‌పోర్ట్‌ను అధికారులు తనిఖీ చేశారని ఆమె చెప్పారు. అందులో తాను పుట్టిన రాష్ట్రం పేరు అరుణాచల్ ప్రదేశ్ అని ఉందని వెల్లడించారు. అది చూసిన తర్వాత ఇమిగ్రేషన్ అధికారులు తన పాస్‌పోర్ట్ చెల్లదని ప్రకటించారని ఆమె ఆరోపించారు. వారు ఆ ఈశాన్య రాష్ట్రాన్ని చైనాలో భాగమని పట్టుబట్టారన్నారు. ఇమిగ్రేషన్ అధికారులు, చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ సిబ్బంది తనవైపు చూసి నవ్వారని, చైనీస్ పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకోమని హేళన చేశారని ఆమె వాపోయారు. చెల్లుబాటు అయ్యే వీసా ఉన్నా కూడా తన పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకున్నారని, జపాన్ వెళ్లే విమానం ఎక్కనివ్వలేదని మీడియాకు వెల్లడించారు. తనను ట్రాన్సిట్ ఏరియాకే పరిమితం చేశారని, మళ్లీ టికెట్లు బుక్ చేసుకోనివ్వలేదని, చివరకు ఆహారం కొనేందుకు కూడా అంగీకరించలేదన్నారు. యూకేలోని ఫ్రెండ్ ద్వారా షాంఘైలోని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించిన తర్వాతే తనకు సహాయం అందిందని పేర్కొన్నారు. భారత అధికారుల సహాయంతోనే తాను అక్కడి నుంచి బయట పడినట్లు చెప్పారు. అలాగే దీనిపై తాను ప్రధాని మోదీకి, ఇతర సీనియర్ అధికారులకు లేఖ రాసినట్లు చెప్పారు. ఇదంతా భారత సార్వభౌమత్వాన్ని, అరుణాచల్ ప్రదేశ్ ప్రజలను అవమానించడమేనని ఆ లేఖలో అభివర్ణించారు. ఈ పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ ప్రస్తుతం యూకేలో నివసిస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారికంగా ఎలాంటి స్పందనా రాలేదు.

# మా అమ్మ క్షేమంగానే ఉన్నారు

హైదరాబాద్, తన తల్లి చింతకుంట రత్నమ్మ ఆరోగ్య పరిస్థితిపై దుష్ప్రచారం జరుగుతోందని.. ఈ వార్తలను ఎవరూ నమ్మవద్దని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. హైటెక్ సిటీ యశోద ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీ రమేశ్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. కొన్ని వార్త పత్రికల్లో, వాట్సాప్ గ్రూపుల్లో తన తల్లి స్వర్గస్తులు అయ్యారని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని వాపోయారు. దయచేసి ఎవరూ అలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, ప్రచారం చేయవద్దని విన్నవించారు. తన తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ, ఆమెకు నిరంతరం వైద్యులు చికిత్స అందిస్తున్నారని చెప్పుకొచ్చారు. తమ కుటుంబం తరపున అందరూ చేస్తున్న ప్రార్థనలకు హృదయపూర్వక ధన్యవాదాలు అని అనకాపల్లి ఎంపీ రమేష్ పేర్కొన్నారు.

# తెలుగు రాష్ట్రాల సీఎంలు బీఅలర్ట్!

బెంగళూర్ :భవిష్యత్తును ఎవరైతే సరిగ్గా అంచనా వేస్తారో వారికి తిరుగు ఉండదు. అసాధారణ విజయాల్ని సొంతం చేసుకుంటారు. అసాధ్యాల్ని సుసాధ్యాలు చేస్తారు. ఈ సూత్రం వ్యక్తులకే కాదు వ్యవస్థలకు ఉండాల్సిందే. దేశంలో ఐటీ నగరిగా బెంగళూరు దూసుకెళ్లటానికి కారణం.. దేశంలోని మహానగరాలు ఐటీ భవితను గుర్తించే నాటికే అక్కడి పాలకులు అక్కడ పునాదులు వేయటమే కాదు.. భవనాలు కట్టేశారు. అదే.. బెంగళూరు ఫ్యూచర్ ను మార్చేయటమే కాదు.. ప్రపంచ పటంలో గార్డెన్ సిటీకి సరికొత్త ఇమేజ్ ను తెచ్చి పెట్టింది. ఐటీ విషయంలో నాటి కర్ణాటక పాలకులు ఎంత ముందుచూపుతో వ్యవహరించారో.. నాటి తమిళ ప్రభుత్వాలు ఐటీని.. దాని సత్తాను గుర్తించటంలో వెనుకపడ్డారు. అదే ఈ రోజున చెన్నై మహానగరం ఐటీ విషయంలో ఎంతలా వెనుకబడిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 400 కంటే ఎక్కువ సంస్థలు బెంగళూరులో కార్యకలాపాలు నిర్వహించటం చూస్తే.. నాటి కర్ణాటక పాలకుల విజన్ ఎంతలా పని చేసిందో ఇట్టే చెప్పేయొచ్చు. ఈ విషయంలో తెలుగు రాష్ట్రాలు మధ్యస్తంగా ఉన్నాయని చెప్పాలి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న వేళలో కర్ణాటక పాలకులంత స్పీడ్ లేకున్నా.. తమిళ ప్రభుత్వాల మాదిరిగానూ లేరు. కాస్త ఆలస్యంగా ఐటీ రేంజ్ ను గుర్తించిన తెలుగు పాలకులు.. ఆ తర్వాత ఆ ఆలస్యాన్ని భర్తీ చేసే ప్రయత్నం చేశారని చెప్పాలి. ఉమ్మడి ఏపీ కాస్తా రెండు తెలుగు రాష్ట్రాలుగా ముక్కలైన వేళ.. హైదరాబాద్ మహానగరి తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉండటంతో ఐటీకి హైదరాబాద్ మహానగరం కేరాఫ్ అడ్రస్ గా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో నాటి పాలకులు హైదరాబాద్ మీద పెట్టిన ఫోకస్ మరే నగరం మీదా పెట్టకపోవటంతో.. హైదరాబాద్ లేని ఏపీ ఐటీ విషయంలో అత్యంత వెనుకబడిన రాష్ట్రంగా మారింది. అయితే.. విశాఖపట్నంలో ఐటీకి అవకాశాలు అంతకంతకూ పెంచుతున్న వైనం.. రానున్న రోజుల్లో ఉక్కునగరంగా పేరున్న వైజాగ్ కు అంతో ఇంతో ఇమేజ్ వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందుకు గూగుల్ డేటా సెంటర్ వైజాగ్ కు వచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రదర్శించిన చొరవ ఒక ఉదాహరణగా చెప్పాలి. ఇప్పటివరకు జరిగింది ఒక ఎత్తు.. ఇకపై జరగాల్సింది మరో ఎత్తుగా చెప్పాలి. ఈ విషయంలో మరోసారి కర్ణాటక ఒక చక్కటి ఉదాహరణగా మారింది. ఐటీ నగరిగా మారిన బెంగళూరు.. ఇటీవల కాలంలో మెరుపుల కంటే మరకలే ఎక్కువగా నమోదవుతున్న పరిస్థితి. దీనికి కారణం.. కొన్ని దశాబ్దాలుగా అక్కడి ప్రభుత్వాలు బెంగళూరు మహానగరంలో మౌలిక వసతుల కల్పన విషయంలో ప్రదర్శించిన అలసత్వం.. ఇప్పుడు గార్డెన్ సిటీకి శాపంగా మారింది. పలు సంస్థలు అక్కడి ట్రాఫిక్ దెబ్బకు దడిచి.. వేరే నగరాలకు వెళ్లిపోతున్న పరిస్థితి. ఇలాంటి వేళ..పూర్తిగా అదుపు తప్పిన బెంగళూరును మళ్లీ గాడిలో పెట్టటం అంత తేలికైన విషయం కాదు. ఈ సందర్భంగా కర్ణాటక పాలకలు కొత్త ఎత్తుగడకు తెర తీశారు. ఇందుకు నిదర్శనంగా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త ఐటీ పాలసీ 2025-2030ను ప్రకటించింది. బెంగళూరు టెక్ సమ్మిట్ 28వ ఎడిషన్ ప్రారంభోత్సవంలో ఈ పాలసీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఆసక్తికరంగానే కాదు.. ఆ రాష్ట్ర సరిహద్దుల్ని పంచుకునే తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వెంటనే అలెర్టు కావాల్సిన అవసరం ఉంది. కొత్త ఐటీ పాలసీలో భాగంగా ప్రకటించిన ప్రోత్సహకాలు సగటు జీవి మొదలు సంస్థల వరకు అందరిని ఆకర్షించేలా ఉండటం దీని ప్రత్యేకతగా చెప్పాలి. ఉదాహరణకు కంపెనీలు నియమించే ప్రతి ఉద్యోగికి రూ.50 వేల వరకు వన్ టైమ్ రీలొకేషన్ ప్రోత్సాహకాన్ని అందిస్తామని ప్రకటించటం. అంటే.. బెంగళూరు నుంచి మైసూరు.. మంగళూరు.. హుబ్లీ-ధార్వాడ్.. కలబురగి.. శివమొగ్గ లాంటి నగరాలకు ఉద్యోగుల్ని తరలించే సంస్థలకు ప్రోత్సహాకం ఇస్తామని ప్రకటించింది. ఈ ఆర్థిక ప్రోత్సాహకాల కోసం కర్ణాటక ప్రభుత్వం ఐదేళ్ల వ్యవధిలో రూ.960 కోట్లు ఖర్చు చేయనుండటం గమనార్హం.

# సకల గోడలూ పడగొడదాం..



హైదరాబాద్,నేను రాయడానికి ఒక్క కారణమే కావాలి. నేను స్త్రీని అని. ఆ వాస్తవమే నాకు మరింత బలమైన న్యాయం ఇస్తుంది. ఇది సమాన సమాజమైతే నేను శుద్ధ సాహిత్యం లేదా ఆనంద సాహిత్యం రాసేదాన్ని. కానీ మనం జీవిస్తున్న సమాజం కులం, ఆర్థిక, లింగ అసమానతలతో నిండి ఉంది కదా. నేను చాలా చిన్న గ్రామంలో పుట్టాను. భారతదేశంలోని ప్రతి గ్రామంలా నా గ్రామం కూడా ఊరు (ప్రధాన గ్రామం), చేరి (దళిత సెటిల్మెంట్)గా విభజించబడి ఉండేది. ఐదు వందల మధ్య తరగతి కుటుంబాల మధ్య నేను పది దళిత కుటుంబాలలో ఒకదానిలో పుట్టాను. నాకు గొప్ప వంశం లేదు, చరిత్ర లేదు. నా తాత పరాయి డ్రమ్మర్. నా తండ్రి కూడా పరాయి డ్రమ్మర్, తర్వాత ఫ్యాక్టరీలో పని చేశాడు.

ముమ్మార్లూ కుల వివక్షపాలయ్యా

బాల్యంలో మూడు సార్లు కులాన్ని ఎదుర్కొన్నాను. మొదటిసారి రెండో లేదా మూడో తరగతిలో. నాతో చదువుకునే అమ్మాయి పేరు తెన్మొజి. ఒక రోజు ఆమె నాకు తేనె మిఠాయి ఇచ్చింది. మరుసటి రోజు ఆమె దయను తిరిగి ఇవ్వాలని అమ్మ దగ్గర మూడు పైసలు అడిగి తేనె మిఠాయి కొని ఇచ్చాను. ఆమె తీసుకోలేదు, దాన్ని నేలకు కొట్టింది. ఆ వయసులో నాకు అర్థం కాలేదు. పెద్దయ్యాకే విషయాలు అర్థమయ్యాయి. ఆమె తల్లిదండ్రులు దళిత పిల్లలతో కూర్చోకూడదు, మాట్లాడకూడదు, వారి నుండి ఏమీ తీసుకోకూడదని చెప్పేవారు. నాతో ఎవరూ మాట్లాడేవారు కాదు, ఆడుకునేవారు కాదు, నా నుండి ఏమీ అంగీకరించేవారు కాదు. నేను ఒంటరిగా ఉండేదాన్ని.

నేను పరాచిని..

రెండోసారి ఆలయ ఉత్సవాల సమయంలో.. నా తండ్రి పరాయి వాయించి ఇంటికి వచ్చాక అందరూ నన్ను ఎగతాళి చేసేవారు. 'నీ తండ్రి పరాయి వాయిస్తాడు. నువ్వు కూడా పరాచి కదా' ఏడవాలనిపించేది, సిగ్గుపడేదాన్ని. చేతులతో ముఖం కప్పుకొని తండ్రిని చూడకుండా నడిచేదాన్ని. పాఠశాలలో దళిత పిల్లలకు నోటుబుక్కులు పంచినప్పుడు మేము లేచి నిలబడాలి. ఇతర విద్యార్థులు నవ్వి ఎగతాళి చేసేవారు. ఇది నా హృదయంలో ఎప్పటికీ మాయని గాయం. సంవత్సరాల తర్వాత నేను 'పరాచి' అనే కవిత రాశాను. నన్ను అవమానించడానికి ఉపయోగించిన పదాన్నే తిరిగి విసిరాను. ఈ రోజు గర్వంగా ప్రకటిస్తాను నేను పరాచిని. మూడవసారి ఏడవ తరగతిలో నాకు నోటుబుక్కు లేదు, పాఠ్యపుస్తకం లేదు. కానీ టీచర్ చెప్పేది జాగ్రత్తగా విని చదివేదాన్ని. నేను తరగతిలో ఫస్ట్ వచ్చేదాన్ని. అయినా దళితురాలని వెనక బెంచ్‌లో కూర్చోబెట్టేవారు. ఇతరులకు బాల్యం గురించి చాలా సంతోషకరమైన విషయాలు చెప్పుకోవడానికి ఉంటాయి. కానీ నాకు ఏమీ లేవు. పద్దెనిమిదేళ్లు ఒంటరిగా ఎవరూ మాట్లాడకుండా, ఆడుకోకుండా, తినకుండా, చీకటి సంవత్సరాల్లా గడిచాయి.

నేను కోల్పోయింది తిరిగి ఇస్తారా?

ఇప్పుడు ఈ ప్రశ్నను సమాజం ముందు ఉంచుతాను. నేను కోల్పోయిన పద్దెనిమిదేళ్ల జీవితాన్ని నాకు ఎవరు తిరిగి ఇస్తారు? నన్ను వదిలేయండి. ఈ రోజు కూడా భారతదేశం అంతటా దళితులు తమకు తిరిగి రాని జీవితాలు జీవిస్తున్నారు. ఇందుకు సమాజం ఏమి చెప్పగలదు. నా న్యాయం ఎక్కడ? అంబేద్కర్ చెప్పినట్లు 'విద్య గొప్ప ఆయుధం' కాబట్టి నేను విద్యను, రచనను ఆయుధాలుగా పట్టుకున్నాను. 1990లలో రాయడం మొదలు పెట్టాను. తమిళ మహిళా రచనకు ముఖ్యమైన కాలం. ఆ కాలం వరకు మహిళా రచన ఎక్కువగా మహిళా ఉనికి, పోరాటాలు, గృహ సమస్యల చుట్టూ ఉండేది. కానీ ఆ కాలంలో మహిళా విముక్తి, శరీర రాజకీయాలు, శరీర భాష గురించి ఉగ్రంగా మాట్లాడడం మొదలైంది. నేను దళిత ఆలోచన, స్త్రీ వాదం, దళిత స్త్రీవాదంతో సంపర్కం పెంచుకున్నాను.

మహిళా విముక్తి ఇక్కడ మొదలవ్వాలని..

మహిళా విముక్తి స్త్రీ శరీర విముక్తి నుండి మొదలవ్వాలి. స్త్రీ శరీరం అంటే లింగ వివక్ష, కుల ఆధారిత లైంగిక హింస, కార్మిక దోపిడీ, ఆర్థిక దోపిడీ, పురుష అధికారం పని చేసే స్థలం. ఆ శరీరం విముక్తి పొందడం, దానిపై రుద్దబడిన అధికారాన్ని ప్రశ్నించడం, ఎదిరించడం అంటే శరీర రాజకీయాలు, శరీర భాష. దీని గురించి మాట్లాడినందుకు మాకు అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. వార్తాపత్రికల్లో కఠినంగా రాశారు. సమాజాన్ని నాశనం చేయడానికి వచ్చినవారమని ముద్రవేశారు. లైవ్ టెలివిజన్‌లో మహిళా కవయిత్రులను చెన్నై మౌంట్ రోడ్డులో పెట్రోల్ పోసి కాల్చేయాలని బెదిరించారు.

అవార్డు తిరస్కరిస్తే విచారణ..

తమిళనాడులో ప్రజా కవి ఇంకులాబ్ సాహిత్య అకాడమీ అవార్డును తిరస్కరించారు. నేను ప్రభుత్వేతర అవార్డును న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్, అదానీ గ్రూప్ ఇచ్చే అవార్డును తిరస్కరించినా కేంద్ర ప్రభుత్వం నన్ను విచారించాలని నిర్ణయించింది. ఇది అసంబద్ధం. నా రచనలు సత్యం. స్పష్టమైన నమ్మకాల నుండి వచ్చాయి. గౌరవం ఉన్నాయి. బలమైనవి. అవి జాలి లేదా కనికరం కోరవు. పాఠకుడిని ప్రకాశవంతం చేస్తాయి. సమానత్వాన్ని డిమాండ్ చేస్తాయి. సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళతాయి, మరింతగా తర్కబద్ధత, స్వాభిమానాన్ని నిలబెడతాయి.

గోడలు పడగొట్టాలి..

మన ముందు అనేక అడ్డంకులు, గోడలు ఉన్నాయి కులం, మతం, వర్గం, పితృస్వామ్యం, స్త్రీ బానిసత్వం, లింగ అసమానత, మహిళలు, పిల్లలపై హింస. న్యాయమైన సమాజానికి అడ్డంకిగా ఉన్న రచనలు ఈ గోడలను పడగొట్టాలి. సాహిత్యం ద్వారా అది సాధ్యం. నవలల ద్వారా, చిన్న కథల ద్వారా, కవితల ద్వారా, రాజకీయ వ్యాసాల ద్వారా, ఆత్మకథల ద్వారా, చిత్రాల ద్వారా. సృజన ద్వారా, చర్య ద్వారా కనిపించే గోడను పడగొట్టవచ్చు.

అన్యాయానికి వ్యతిరేకంగా రచన

ఈ యువ సాహిత్య ఉత్సవాలు ఎంతో ఉపయోగపడతాయి. మీరు రేపటి నక్షత్రాలు. రాయండి. చదవండి. రాజకీయంతో రాయండి. రాజకీయం లేని రచన సమాజానికి, మనకు ఉపయోగం లేదు. కాబట్టి అన్యాయం గోడకు వ్యతిరేకంగా మన రచనను ఎత్తుదాం. విద్య ఒక శక్తివంతమైన ఆయుధం. కానీ రచన రెండు అంచులు పదునైన ఆయుధం. ఆ ఆయుధంతో ఈ గోడలను పడగొట్టుదాం. సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛను నిర్మిద్దాం. అన్యాయానికి వ్యతిరేకంగా మన రచనను ఉంచుదాం. తిరుగుబాటు చేద్దాం. గోడలను పడగొట్టుదాం.

# తిరుచానూరులో అంగరంగ వైభవంగా రథోత్సవం

తిరుపతి, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం రథోత్సవం ఆలయ నాలుగు మాడ వీధుల్లో సాగింది.

భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగారు. సర్వాలంకార శోభితమైన రథంలో ప్రకాశించే అలమేలు మంగ సకలదేవతా పరివారంతో వైభవోపేతంగా తిరువీధులలో విహరించారు. అనంతరం అమ్మవారికి రథమండపంలో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, పన్నీరు, వివిధ రకాల ఫలాలతో అభిషేకం చేసి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. రాత్రి అమ్మవారు అశ్వవాహనంపై దర్శనం ఇవ్వనున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. రథోత్సవంలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వి. వీర బ్రహ్మం, సివిఎస్వో కే.వి. మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఆలయ అర్చకులు బాబు స్వామి, శ్రీనివాసా చార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

# 'ఐ బొమ్మ' రవి వెనుక చీకటి కోణం.. సినిమా వాళ్లే ఉన్నారా?

హైదరాబాద్, 'ఐ బొమ్మ' రవి .. ప్రస్తుతం ఈ పేరు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా యావత్ చిత్ర పరిశ్రమలను కుదుపేస్తుంది. ముఖ్యంగా టాలీవుడ్(ను అతలాకుతలం చేస్తుంది. పైరసీ మాఫియాను నడుపుతూ దమ్మంటే పట్టుకోండని సవాల్ చేసిన ఇమ్మడి రవిని పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. అయితే ఇప్పుడే అసలైన సినిమా మొదలైంది. తెలుగు చిత్ర పరిశ్రమలో ఉండే అంతర్గత విభేదాలు ఒక్కొక్కటిగా బయటకు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల హైదరాబాద్ సీపీ సజ్జనార్.. కొందరు సినీ ప్రముఖులతో పెట్టిన ప్రెస్ మీటే టాలీవుడ్ అంతర్గత వైరుధ్యాలను స్పష్టం చేశాయని పలువురు విశ్లేషకులు అంటున్నారు. అంతేకాదు.. 'ఐ బొమ్మ' తెరవెనుక తెలుగు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులే ఉన్నారనే అనుమానాలను సైతం వ్యక్తం అవుతున్నాయి. అయితే ఆ అనుమానాల వెనుక దాగి ఉన్న.. విస్తుపోయే నిజానిజాలను ఇప్పుడు తెలుసుకుందాం.'ఐ బొమ్మ' తెర వెనుక చీకటి కోణం: ఆన్‌లైన్‌లో ఉచితంగా కొత్త సినిమాలను అందించే ప్లాట్‌ఫామ్ 'ఐ బొమ్మ'. ఒకప్పుడు ఇది కేవలం సాధారణ పైరసీ వెబ్‌సైట్ మాత్రమే. కానీ దీని నిర్వాహకుడైన ఇమ్మడి రవి అరెస్ట్ కావడంతో విస్తుపోయే నిజాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇటీవల సీపీ సజ్జనార్ ప్రెస్‌మీట్‌లో చెప్పిన కొన్ని విషయాలను నిశితంగా పరిశీలిస్తే.. 'ఐ బొమ్మ రవి' మాస్టర్ మైండ్ వెనుక ఎవరైనా సినీపెద్దలు ఉన్నారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎందుకంటే ఐ బొమ్మ కార్యకలాపాల తీరు సాధారణ పైరసీ సైట్ల కంటే భిన్నంగా ఉందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సినిమాలు విడుదలైన కొన్ని గంటల్లోనే హెచ్‌డీ క్వాలిటీతో సైట్లో అందుబాటులోకి వస్తున్నాయి. అయితే ఇక్కడ గమనించాల్సింది ఏంటంటే ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తెలుగు సినిమాలు మాత్రమే ఇంత క్వాలిటీతో ఆన్‌లైన్‌లో ఉంటున్నాయి. అంతేకాకుండా చాలా వేగంగా 'ఐ బొమ్మ' వెబ్‌సైట్‌లోకి వస్తున్నాయి. ఇంత వేగం, క్వాలిటీతో సినిమాలు వెబ్‌సైట్‌లోకి వస్తున్నాయంటే.. 'ఐ బొమ్మ' తెరవెనుక వెనుక ఏదో పెద్ద మాఫియానే ఉందనేది నగ్నసత్యం. అయితే ఆ మాఫియాలో సినీ పెద్దలు ఎవరైనా ఉన్నారా? అనేదే ఇక్కడ అసలైన ప్రశ్న. అయితే దీనికి సమాధానం పోలీసుల విచారణలోనే తేలాలి. పైరసీ మూలాల్లో అనేక అనుమానాలు: పైరసీ భూతంతో గత కొన్నేళ్లుగా సినీ పరిశ్రమకు ప్రశాంతత లేకుండా చేస్తున్న 'ఐ బొమ్మ' కారణంగా సినీపరిశ్రమకు వేల కోట్ల మేర నష్టం వాటిల్లింది. అయితే ఈ నష్టానికి ప్రధాన కారణం ఇమ్మడి రవి అయినప్పటికీ.. పైరసీ మూలాల్లోని చిన్న చిన్న విషయాలు అనేక అనుమానాలకు తావిస్తోంది. తల్లి పాలు తాగి



రొమ్మును గుద్దినట్లుగా సినీ పరిశ్రమలో ఉంటూ.. ఆ పరిశ్రమపైనే కొందరు వ్యక్తులు సీతకన్నేశారనేది నగ్నసత్యం. తమకు సంబంధించిన సినిమాలు కాకుండా.. ప్రత్యర్థుల సినిమాలు లీకైనప్పుడు పరిశ్రమలో నెలకొనే నిశ్శబ్దమే ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తుంది. పైరసీ థియేటర్ వ్యవస్థకు మరణ శాసనం: 'ఐ బొమ్మ' వంటి పైరసీ ప్లాట్‌ఫామ్‌లు కేవలం నిర్మాతలకే కాదు.. థియేటర్ యజమానులకూ మరణ శాసనం వంటిదే. సాధారణంగా ఒక సినిమా ఓటీటీలోకి రావడానికి కనీసం నాలుగు వారాలు పడుతుంది. కానీ ఐ బొమ్మలో సినిమా విడుదలైన మొదటి వారంలోనే అందుబాటులోకి వస్తుంది. దీంతో థియేటర్‌కు వచ్చి సినిమా చూసే ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోతోంది. ముఖ్యంగా చిన్న, మధ్యస్థాయి సినిమాలైతే కోలుకోలేని నష్టాలను చవిచూస్తున్నాయి. ఎందుకంటే సినిమా టికెట్ల ధరలు, పాప్‌కాన్ ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రేక్షకులు ఉచితంగా సినిమా చూసే అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నారు. అందుకే పేద మధ్యతరగతి సినీప్రేమికులను 'ఐ బొమ్మ' వంటి పైరసీ ప్లాట్‌ఫామ్‌లు ఆకర్షిస్తున్నాయి. దీంతో 'ఐ బొమ్మ రవి'ని సాధారణ ప్రజలు రాబిన్‌హుడ్‌గా చూస్తున్నారు. కళామ్మ తల్లి బతకాలంటే: తెలుగు సినిమా పరిశ్రమ శతాబ్దాలపాటు కళకళలాడాలంటే.. ముందుగా సినీ పెద్దలు తమ అంతర్గత విభేదాలను పక్కన పెట్టాలి. ఐకమత్యంతో లీకేజీలకు మూలకారణం అయిన అంశాలపై దృష్టి సారించాలి. లేదంటే ఐ బొమ్మ లాంటి వేదికలు తెలుగు సినీ పరిశ్రమను కుప్పకూల్చే ప్రమాదం ఉంది. పోలీసులు సైతం 'ఐ బొమ్మ రవి' విషయంలో అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలి. పైరసీ వెబ్‌సైట్లు, బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన అంశాలలో ఇమ్మడి రవి వెనుకు ఉన్న పెద్ద తలకాయలను గుర్తించాలి. లేదంటే కళామ్మతల్లి నీడలో బతికే నటీనటులు, దర్శకులు, రచయితలు, కవులు, కార్మికులు మరీ ముఖ్యంగా చిన్న చిన్న నిర్మాతలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది.

# ఐదేళ్ల జగన్ పాలనలో రైతులకు కన్నీళ్లే

న్యూఢిల్లీ, జగన్ హయాంలోని ఐదేళ్లలో రైతుల కోసం చేసిన మంచి పనులు ఏమున్నాయని తెలుగుదేశం పార్టీ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రశ్నించారు. జగన్ పాలనలో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని ధ్వజమెత్తారు. అన్నదాతలు వైసీపీ హయాంలో చాలా నష్టపోయారని ఆరోపించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కలిశెట్టి అప్పలనాయుడు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో రెండు విడతలుగా 'అన్నదాత సుఖీభవ' నిధులు విడుదల చేశామని స్పష్టం చేశారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు రైతులకు ఇప్పటికే రూ.14,000 ఇచ్చామని చెప్పుకొచ్చారు. త్వరలో మూడో విడతగా రూ.6,000 విడుదల చేస్తామని పేర్కొన్నారు. మొత్తం సంవత్సరానికి రూ.20,000 అన్నదాతలకు సహాయం చేశామని తెలిపారు. ప్రకృతి విపత్తుల్లో సీఎం నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఫీల్డ్‌లోకి వచ్చి చర్యలు చేపట్టారని గుర్తుచేశారు. రైతాంగం ఎన్డీఏ నాయకత్వానికి పూర్తిగా అనుకూలంగా ఉందని తెలిపారు. జగన్ నాంపల్లి కోర్టుకు హాజరు కావడాన్ని కూడా పూర్తిగా రాజకీయ ర్యాలీగా మార్చారని విమర్శలు చేశారు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు. పీకి పెట్టుబడులు భారీగా వస్తున్నాయని.. ఇదంతా చంద్రబాబు నాయకత్వం వల్లే సాధ్యమవుతోందని వివరించారు. విశాఖపట్నంలో నిర్వహించిన సమ్మిట్‌లో రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏపీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని పేర్కొన్నారు. సీఎం సతీమణి నారా భువనేశ్వరి ప్రజల్లో మమేకమై వారి ప్రశంసలు అందుకుంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను నెంబర్ వన్ రాష్ట్రంగా చేస్తామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు.

# ఈ సారి కష్టమే !

కోల్ కతా :బీహార్‌లో మరోసారి గెలిచిన తర్వాత మా టార్గెట్ బెంగాల్ అని ప్రధాని మోదీ, అమిత్ షా సవాల్ చేశారు. మరో ఆరు నెలల్లో అంటే వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో జరగనున్నాయి. మమతా బెనర్జీ ఇప్పటికి పదిహేనేళ్లుగా అధికారంలో ఉన్నారు. వరుసగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. కానీ నాలుగోసారి మాత్రం అంత తేలికగా కనిపించడం లేదు. ఎందుకంటే పదిహేనేళ్ల కిందటితో పోలిస్తే ఇప్పుడు రాజకీయం మారిపోయింది. అప్పట్లో కమ్యూనిస్టులు వర్సెస్ మమతా బెనర్జీ అన్నట్లుగా ఉండేది. ఇప్పుడు కమ్యూనిస్టుల ప్లేస్‌లో బీజేపీ వచ్చి చేరింది.

కమ్యూనిస్టుల్ని నిర్వీర్యం చేసి బీజేపీని పెంచిన మమతా బెనర్జీ

బెంగాల్ రాజకీయంలో భారతీయ జనతా పార్టీ ఎదిగిందంటే దానికి కారణం మమతా బెనర్జీనే. బెంగాల్ లో కమ్యూనిస్టులు దశాబ్దాల తరబడి అధికారంలో ఉన్నారు. పైకి ఏం చెప్పినా బెంగాల్ లో వారు గ్రామాల్లో గ్రూపుల గొడవలు, హత్యా రాజకీయాల ద్వారా ఎక్కువగా అధికారంలో ఉన్నారని నమ్ముతారు. అలాంటి రాజకీయాలను ఎదిరించి మమతా బెనర్జీ విజయం సాధించారు. కమ్యూనిస్టు పార్టీపై వ్యతిరేకతతో ప్రజలు మమతా బెనర్జీని గెలిపించారు. ఆ తర్వాత ఆమె కమ్యూనిస్టుల చూపిన దారిలో తాను రెండాకులు ఎక్కువే చదివానన్నట్లుగా రాజకీయాలు చేసి క్రమంగా వారిని నిర్వీర్యం చేయడం ప్రారంభించారు. అదే సమయంలో బీజేపీ ఎదుగుతుందన్న సంగతిని గుర్తించలేదు.

నిలువ నీడ లేక బీజేపీ పంచన చేరిన కమ్యూనిస్టులు

కమ్యూనిస్టు భావజాలానికి, బీజేపీకి అసలు పొంతనే ఉండదు. కానీ రాజకీయం అంటే.. భావజాలం ఎప్పటికప్పుడు మారిపోవడమే. దానికి తగ్గట్లుగానే పెద్ద ఎత్తున కమ్యూనిస్టులు దాడులకు గురవుతూంటే.. రక్షణ కోసం బీజేపీలో చేరిపోవడం ప్రారంభించారు. బెంగాల్లో ముస్లింలు కూడా ఎక్కువే. అయితే వారిలోనూ కమ్యూనిస్టులు ఎక్కువ. వర్గ పోరాటాల్లో కొంత మంది బీజేపీకి మద్దతుగా ఉంటున్నారు. పదేళ్ల కిందటి వరకూ బీజేపీ అత్యంత బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో ఒకటి బెంగాల్. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఓటు బ్యాంక్ కేవలం 10 శాతం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అది 40 శాతానికి చేరుకుంది. 2021 అసెంబ్లీలో 38 శాతం , 2024 లోక్‌సభ ఎన్నికలలోనూ అంతే పర్సంటేజీలో ఓట్లు సాధించి బలంగా నిలిచింది

బీజేపీ ఈ సారి మిస్ కావాలనుకోవడం లేదు !

బీజేపీలో ఇప్పుడు పెద్ద నేతలు ఉన్నారు. మమతా బెనర్జీ నీడలో ఎదిగిన నేతలే ఇప్పుడు బీజేపీలో ఉన్నారు. వారందరికీ మమతా బెనర్జీని ఎలాగైనా పదవి నుంచి దింపాలని టార్గెట్. అందుకే మోడీ, షా మార్గదర్శకత్వంలో వారు తమ పని ప్రారంభించారు. రాష్ట్రాన్ని 6 రాజకీయ జోన్లుగా విభజించి.. ప్రతి జోన్‌కు ఒక్కొక్క కీలక నేతకు బాధ్యతలు అప్పగించారు. వచ్చే ఆరు నెలలు వారు ఈ పని మీదనే ఉంటారు. బీజేపీకి ప్రతి ఓటర్ ను చేరుకునే ప్రత్యేకమైన యంత్రాంగం ఉంటుంది. దాన్ని యాక్టివేట్ చేస్తున్నారు.


గ్రామీణ ప్రాంతాల్లో పట్టు, ముస్లింలపైనే దీదీ ఆశలు

కమ్యూనిస్టులను తరిమేసి గ్రామ స్థాయిలో పట్టు పెంచుకున్నారు మమతా బెనర్జీ. ఎవరైనా ఎదురుతిరిగితే దాడులు చేస్తారు. దాంతో పాటు ముప్ఫై శాతం వరకూ ఉన్న ముస్లింలలు గట్టి ఓటు బ్యాంకుగా ఉన్నారు. వారిపై నమ్మకంతో మమతా బెనర్జీ ధీమాగా ఉన్నారు. కానీ పదిహేనేళ్ల పాలన ప్రజా వ్యతిరేకత.. ఆమెకు పెను గండంగా మారనుంది. అందుకే.. ఈ సారి బీజేపీ నుంచి ఆమె ఓటమి తప్పించుకోవడం సాధ్యం కాదన్న వాదన వినిపిస్తోంది. బీజేపీని ఎదుర్కొని విజయం సాధిస్తే.. ఆమె ఇమేజ్ దేశంలో మరింతగా పెరుగుతుంది.

# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం


చెన్నై, తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తెనకాశీ-మదురై రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు ప్రైవేటు బస్సులు ఒకదాన్నొకటి ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. మరో 28 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. మదురై నుంచి సెన్‌కొట్టాయ్ వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు.. తెన్‌కాశీ నుంచి వస్తోన్న మరో బస్సును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం దాటికి రెండు బస్సులు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగం,నిర్లక్ష్యపు డ్రైవింగే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికం గా నిర్ధరించారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, సీసీటీవీ ఫుటేజ్‌లను సేకరిస్తున్నామని తెలిపారు. ప్రమాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు.

# స్థానిక ఎన్నికలకు ఎలా..? వైసీపీ కేడర్ లో అంతర్మథనం!



అమరావతి,ఏపీలో స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు మొదలుపెట్టింది. 175 నియోజకవర్గాల్లోని పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. మార్చిలో పదో తరగతి పరీక్షలు పూర్తయిన తర్వాత పంచాయతీలకు ఆ తర్వాత కొంత సమయం తీసుకుని మున్సిపాలిటీలు, ఆ వెంటనే మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్లాన్ చేస్తోంది. దీంతో రాష్ట్రంలో అప్పుడే పొలిటికల్ హీట్ పెరిగిపోయింది. ఏ ఇద్దరు కార్యకర్తలు కలుసుకున్నా కూడికలు, తీసివేతలు వేసుకుంటూ లెక్కలు వేస్తున్నారు. అధికారం చేతిలో ఉందనే ఉత్సాహంతో టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు కదన కుతూహలం ప్రదర్శిస్తున్నాయి. ఇదే సమయంలో వైసీపీలో నిశ్శబ్దం రాజ్యమేలుతోందని అంటున్నారు. ఆ పార్టీలో ఏ ఒక్కరు స్థానిక ఎన్నికల కోసం మాట్లాడటం లేదని అంటున్నారు.గతంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో వైసీపీ రాష్ట్రంలో 99 శాతం స్థానాలను కైవసం చేసుకుంది. అప్పట్లో అధికారం అండతో మెజార్టీ స్థానాల్లో ఏకగ్రీవం అయ్యేలా ఆ పార్టీ నేతలు చక్రం తిప్పారని అంటున్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీలో నాయకులు, కార్యకర్తలు పూర్తిగా డీలా పడిపోయినట్లు కనిపిస్తున్నారు. చాలా మంది గతంలో తాము వ్యవహరించిన విధానాలను గుర్తుకు తెచ్చుకుని.. ఇప్పుడు అధికార పార్టీ అదే తరహా రాజకీయం చేస్తుందా? అని సందేహిస్తున్నారు. అలా అయితే తాము అధికార కూటమిని ఎలా ఎదుర్కోగలమని అంతర్గత భేటీల్లో చర్చించుకుంటున్నారని అంటున్నారు.గతంలో ఏకపక్ష విజయాలను సాధించిన వైసీపీ.. ఇప్పుడు కనీసం పోటీ ఇచ్చే పరిస్థితి ఉందా? అన్న చర్చ జరుగుతోంది. ఎందుకంటే స్థానిక ఎన్నికలపై ఆ పార్టీ అధిష్టానం నుంచి గానీ, జిల్లా, నియోజకవర్గ స్థాయి నేతల నుంచి కానీ ఇంతవరకు ఎలాంటి ముందస్తు సన్నాహాలు కనిపించడం లేదు. కనీసం స్థానిక ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలనే విషయమై నియోజకవర్గ స్థాయిలో కనీసం ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదని అంటున్నారు. పార్టీలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు నడుచుకుంటుండటం వల్ల.. గ్రామస్థాయిలో అధికార పార్టీతో పోరాటంపై వైసీపీ కేడర్ డైలమాలో పడిపోతోందని అంటున్నారు.ఇక రాయలసీమ, పల్నాడు వంటి ప్రాంతాల్లో ఫ్యాక్షన్ ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో తాము నామినేషన్ వేసే అవకాశం కూడా ఉండకపోవచ్చని వైసీపీ కార్యకర్తలు ముందే కాడి వదిలేస్తున్న సంకేతాలిస్తున్నారని అంటున్నారు. పార్టీ అధిష్టానం అండ లేకపోతే స్థానిక ఎన్నికలపై తాము ఒక్క అడుగు ముందుకు వేయలేమని వైసీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నాయి. అయితే అధినేత జగన్ మాత్రం అసలు స్థానిక ఎన్నికలను ఏ మాత్రం సీరియస్గా తీసుకున్నట్లు కనిపించడం లేదని అంటున్నారు. గతంలో పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలతోనే ఎన్నికలు నిర్వహించాలని, అప్పుడే ప్రతిపక్షానికి రక్షణ ఉంటుందని జగన్ వ్యాఖ్యానించారు. ఆ ఎన్నికల్లో అధికార పార్టీ స్పీడుతో సొంత స్థానాన్ని కూడా జగన్ నిలుపుకోలేకపోయారని అంటున్నారు. ఇది గుర్తించుకున్న వైసీపీ కేడర్.. వచ్చే స్థానిక ఎన్నికల్లో ఇంతకుమించు అదే విధంగా జరిగే అవకాశాలు ఉన్నాయంటున్నారు. దీంతో స్థానిక సమరం వైసీపీ కేడర్ ను తీవ్ర అంతర్మథనానికి గురిచేస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు.

# సిద్దూ ఔట్..? కర్ణాటక సీఎంగా డీకే..? వేగంగా మారుతున్న పరిణామాలు?



బెంగళూర్ :కర్ణాటక రాజకీయాలు మరోసారి ఉత్కంఠకు గురవుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊహాగానాలకు తెరతీశాయి. "పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తేనే నేను ఐదేళ్లు సీఎంగా కొనసాగుతాను" అని ఆయన చేసిన వ్యాఖ్యలు, సీఎం మార్పుపై చర్చలను మరింత రగిలించాయి.ఇప్పటివరకు "ఐదేళ్లు తానే ముఖ్యమంత్రి" అని ధీమాగా చెప్పిన సిద్ధరామయ్య... ఇప్పుడు ఆ స్వరాన్ని కొంత మార్చడం గమనార్హం. ముఖ్యమంత్రి మార్పు పూర్తిగా కాంగ్రెస్ కేంద్ర నాయకత్వ నిర్ణయమని, తాను , ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆ నిర్ణయాన్ని పాటించాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు.

రెండున్నరేళ్ల ఫార్ములా గడువు ముగిసింది

2023లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి గద్దె మీదకు వచ్చిన సమయంలోనే, రెండు–రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ జరుగుతుందన్న ప్రచారం పార్టీ వర్గాల్లో బలంగా వినిపించింది. నవంబర్ 20తో ఆ అనధికారిక గడువు ముగియడంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఇదే సమయంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డీకే శివకుమార్ శిబిరాల నేతలంతా ఢిల్లీకి తరలివెళ్లడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది.

ముఖ్యమంత్రి కుర్చీ పోటీ పెరిగిందా?

మొదట ముఖ్యమంత్రి పదవి పోటీ కేవలం సిద్ధరామయ్య – డీకే శివకుమార్ మధ్యనే ఉందని భావించబడింది. కానీ ఇప్పుడు పోటీ మరింత విస్తరించినట్లు తెలుస్తోంది. బెంగళూరులో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసాన్ని ముఖ్యమంత్రి పీఠం కోసం ప్రధాన ఆశావహులు సందర్శించడం రాజకీయ అనుమానాలకు తావిచ్చింది.

డీకేపై అధిష్ఠానం సందేహాలు?

ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్పై అధిష్ఠానానికి పూర్తిగా సానుకూలత లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆయనకు మంచి నాయకత్వ లక్షణాలు ఉన్నా, పార్టీ అంతటా విస్తృతమైన మద్దతు లేదని కేంద్ర నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, సిద్ధరామయ్య తన వర్గానికి చెందిన అహింద వర్గానికి చెందిన నాయకత్వాన్ని బలపరచాలన్న లక్ష్యంతో ప్రయత్నిస్తున్నారనే ప్రచారం కూడా ఉంది.

రాహుల్ గాంధీ జోక్యం?

ఈ గందరగోళం అంతర్గత అసంతృప్తిని నివారించడానికి రాహుల్ గాంధీ జోక్యం చేసుకునే అవకాశముండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయనే చివరకు అధికార పంపిణీపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముందని భావిస్తున్నారు.కర్నాటక కాంగ్రెస్లో నాయకత్వంపై నెలకొన్న ఈ అస్పష్టత, రాష్ట్రంలోనే కాక జాతీయ స్థాయిలో కూడా చర్చనీయాంశమైంది. తదుపరి రోజుల్లో అధిష్ఠానం తీసుకునే నిర్ణయం కేవలం కర్ణాటక భవిష్యత్ పాలననే కాదు.. కాంగ్రెస్ అంతర్గత శక్తి సమీకరణాలనూ స్పష్టతచేస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రియల్ ఎస్టేట్ కంపెనీలపై ఈడీ దాడులు

హైదరాబాద్: హైదరాబాద్లోని పలు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల కార్యాలయాలు, వాటి నిర్వాహకుల నివాసాల్లో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ తనిఖీలు జరిగాయి. జనప్రియ, రాజా డెవలపర్స్, సత్యసాయి, గాయత్రి హోమ్స్, శివసాయి కన్స్ట్రక్షన్స్తో సహా మొత్తం ఎనిమిది సంస్థల్లో ఈ సోదాలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. జయత్రి ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని మేనేజింగ్ డైరెక్టర్ కాకర్ల శ్రీనివాస్, అనుబంధ సంస్థలపై %ూమీూా%, 2002 కింద కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ప్రీలాంచ్ స్కీమ్ పేరిట గృహ కొనుగోలుదారులను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో అరెస్టై.. బెయిల్ మీద బయటకు వచ్చిన శ్రీనివాస్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. అయితే.. ఈ స్కాంతో లింకుల నేపథ్యంలో ఎనిమిది రియల్ ఎస్టేట్ సంస్థల్లో తాజాగా తనిఖీలు నిర్వహించారు. రియల్ ఎస్టేట్ రంగంలో అక్రమ నగదు చలామణి.. మనీలాండరింగ్ అనుమానాల నేపథ్యంలో ఈ దాడులు జరిగినట్లు తెలుస్తోంది.



సోదాల సమయంలో అధికారులు కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.

# కృష్ణుడికి లేని వివక్ష మీకెందుకు?



హైదరాబాద్,శ్రీకృష్ణుడికి లేని కుల వివక్ష మీకెందుకని హిందూ ధర్మ పరిరక్షకుల్ని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ ఇవాళ ప్రశ్నించారు.తమ మాదిగ జాతికి చెందిన జాంబవంతుడి కూతురును శ్రీకృష్ణుడు వివాహమాడలేదా అని అడిగారు. తెలంగాణలోని ఎల్లంపల్లిలో మాదిగ బిడ్డను హత్య చేసింది యాదవుడే కదా అన్నారు. లోకంలో ఇదేం ధర్మమని ఆయన ప్రశ్నించారు. అందరూ సమానమేనని హిందూ ధర్మ రక్షకులు ముందుకు రావాలన్నారు. కుల మత వివక్షలేని రాజ్యాన్ని స్థాపిద్దామన్నారు.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని ఎల్లంపల్లి గ్రామంలో ఇటీవల దళితుడు ఎర్ర రాజశేఖర్ పరువు హత్యకు గురైన సందర్భంగా ఆయన దశదినకర్మ కార్యక్రమంలో మందకృష్ణ పాల్గొన్నారు. ఎర్ర రాజశేఖర్ పరువు హత్యకు దారి తీసిన విషయాలను కుటుంబ సభ్యుల్ని అడిగి తెలుసుకున్న మందకృష్ణ.. అనంతరం కీలక వ్యాఖ్యలు చేశారు. హిందువులు పూజించే శ్రీకృష్ణుడు, యాదవులకు ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణుడు ఆనాడు తమ జాతికి చెందిన జాంబవంతుడు కుమార్తె జాంబవతిని వివాహమాడారని ఆయనకు లేని కుల వివక్ష ఇక్కడ యాదవులకు ఎందుకని ? మందకృష్ణ మాదిగ అన్నారు.ఎల్లంపల్లి గ్రామంలో దళితుడు ఎర్ర రాజశేఖర్ సోదరుడు యాదవ యువతిని ప్రేమించిన కారణంగా ఆ యువతి తండ్రి వెంకటేష్ ఒక యాదవుడని అతనికి తమ దైవం శ్రీకృష్ణ భగవానుడు గురించి తీయలేదని ప్రశ్నించారు. భగవంతుడే కులాలను విశ్వసించకుండా వివాహమాడినప్పుడు అప్పుడు యాదవ వంశ పెద్దలకు లేని వివక్ష ఇక్కడ సమాజంలో కుల వివక్ష ఎందుకు వచ్చిందని ఘాటుగా ప్రశ్నించారు. సమాజంలో పెట్రేగిపోతున్న కుల వివక్షను రూపుమాపడానికి హిందూ ధర్మ రక్షకులు, సనాతన ధర్మాన్ని కాపాడే వారు ముందుకు రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.భగవంతుడు సమాజంలో కుల మతాలకు అతీతంగా అందరిని సమానంగా చూడమని బోధించాడని మరి హిందూమతంలోని ఇలాంటి వివక్షలు పెరిగి చంపేందుకు కారణం అవుతుంటే వీటిపై మాట్లాడడానికి హిందూ ధర్మ రక్షకులు ముందుకు రావలసిన సమయం ఆసన్నమైందని మందకృష్ణ సూచించారు. కుల వివక్ష కరోనా కంటే ప్రమాదకరమైనదని, కరోనా ను రూపుమాపేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి ఆ మహమ్మారిని పారద్రోలు ఎందుకు ఇలాంటి ప్రచార చర్యలు తీసుకున్నారు ప్రత్యేక నిధులు కేటాయించారు కుల వివక్షను కూడా రూపుమాపేందుకు అలాంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కుల వివక్ష వెంటనే పోదని కాకపోతే రాబోయే భవిష్యత్తులో కచ్చితంగా ఇది మంచి ఫలితాన్ని ఇస్తుందని మందకృష్ణ మాదిగ అన్నారు.

# మహిళా స్వయం సహాయక సంఘాలకు 304 కోట్లు



హైదరాబాద్,రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. తాజాగా మహిళా స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. ఈ మహిళా సంఘాలకు రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం విడుదల చేసింది. 3,57,098 గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో ఈ నిధులను జమ చేసింది. సోమవారం హైదరాబాద్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జిల్లా డీఆర్డీఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ నిధులను మహిళలకు అందచేయనున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యక్రమం జరుగుతుందని డిప్యూటి సిఎం భట్టి వెల్లడించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క.. ఏటూరు నాగారం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని తెలిపారు.ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వేల కోట్ల రూపాయల నిధులను సమకూరుస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ భారం లేకుండా ప్రభుత్వమే వాటిని చెల్లిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ. 3,500 కోట్ల వడ్డీలను ఎగవేసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై ఈ సందర్భంగా సీతక్క మండిపడ్డారు. అంతే కాకుండా స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పొదుపు సొమ్మును సైతం గత ప్రభుత్వం కాజేసిందని విమర్శించారు. అక్కా చె÷–లలెమ్మల కష్టార్జితమైన అభయహస్తం నిధులను కూడా ప్రభుత్వం మింగేసిందన్నారు. కానీ తమ ప్రజా ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ఎన్నో పథకాలను ప్రారంభించిందని గుర్తు చేశారు. మహిళలకు నిధులను సమీకరించడమే కాదు.. ఈ వడ్డీలను కూడా సకాలంలో చెల్లిస్తున్నామని చెప్పారు. ఆడబిడ్డల కష్టాన్ని కాజేసి కన్నీళ్ళకు కారణమైన బీఆర్ఎస్ పెద్దలకు మహిళా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదంటూ ఆ పార్టీ నేతలకు సూచించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది రూ. 25 వేల కోట్లు తగ్గకుండా బ్యాంక్ లింకేజీ రుణాలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని సీతక్క వివరించారు. ఈ సంఘాలకు క్రమం తప్పకుండా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. తాజాగా రూ. 304 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. మహిళా సంఘాల ఖాతాల్లో ఈ నిధులు జమ అయినాయి.

# ఢిల్లీ పరిస్థితే రేపు దేశానికంతా వస్తే..!

న్యూఢిల్లీ,గత కొన్ని సంవత్సరాలుగా ఢిల్లీ మరియు ఉత్తర భారతదేశం ఒకే సమస్యతో పోరాడుతున్నాయి. ఆ సమస్యే గాలి కాలుష్యం. శీతాకాలం మొదలయ్యే సరికి ఆకాశం మసకబారడం, సూర్యుడి వెలుగు నిస్సత్తువగా పడిపోవడం, దూరంలో ఒక కిలోమీటరు కూడా స్పష్టంగా కనిపించకపోవడం ఇవన్నీ ఢిల్లీ ప్రజలకు చికాకు కాదు, దాదాపు జీవనశైలే అయిపోయాయి. ఈ కాలుష్యం సంఖ్యలు 350, 400, 450 దాటుతూ, ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర నగరాల జాబితాలో ఢిల్లీ మళ్లీ ముందంజలో నిలుస్తోంది. ఇది కేవలం ఒక నగర పరిస్థితి కాదుబీ ఉత్తర భారతదేశం మొత్తాన్ని ప్రభావితం చేసే ఒక మహా వైద్య–పర్యావరణ సంక్షోభం.ఈ కాలుష్యానికి ప్రధాన కారణాలు అందరికీ తెలిసినవే. పంజాబ్, హర్యానా ప్రాంతాల్లో పంట మిగులు కాల్చడం, నిర్మాణ ప్రాజెక్టుల నుంచి వచ్చే భారీ ధూళి, దుమ్ము నియంత్రణ లేమి, పరిశ్రమల నుంచి వెలువడే పొగ, ఇంకా ఢిల్లీ–ఎన్సిఆర్ ప్రాంతంలో అదుపు తప్పిన వాహనాల సంఖ్య ఇవన్నీ కలిసినప్పుడు గాలి పూర్తిగా విషతుల్యంగా మారిపోతుంది. ఈ సమస్య ప్రతి సంవత్సరం వస్తూనే ఉన్నప్పటికీ, పరిష్కారం మాత్రం ఎక్కడా కనబడటం లేదు. రాష్ట్రాలు ఒకదానిపై ఒకటి నిందలు వేస్తూ, రాజకీయాలు నిత్యవాద్యంగా సాగుతాయిబీ కానీ ప్రజల శ్వాస మాత్రం నాళ్లకండినా ఇరుక్కునేలా మారుతోంది.గాలి కాలుష్యం ప్రభావం అత్యంత ప్రమాదకరమైంది. పిల్లల్లో దగ్గు, శ్వాస సమస్యలు, ఆస్తమా కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. పెద్దలలో హృదయ సంబంధ సమస్యలు, ఊపిరితిత్తుల పనితీరు తగ్గడం, వృద్ధుల్లో శ్వాస తీసుకోవడమే ఓ భారమైన పనిగా మారడం ఇవన్నీ కనిపించే లక్షణాలు. కానీ కనిపించని ప్రభావాలు మరింత ఘోరంగా ఉంటాయి. దీర్ఘకాలంలో మానసిక అలసట, ఛాతిలో బరువు, తలనొప్పులు, ఉత్పాదకత తగ్గడం, నిద్రలేమి వంటి సమస్యలు సాధారణంగా మారిపోతాయి. పరిశోధనల ప్రకారం, అత్యధిక కాలుష్యం ఉన్న నగరాల్లో నివసించే వ్యక్తుల ఆయుష్షు సహజంగానే తగ్గే అవకాశం ఉంది.ఇది కేవలం దిల్లీ సమస్య అని అనుకోవడం పొరపాటు. గాలి ఏ రాష్ట్రానికి పరిమితం కాదు, అది దిశలు దాటి ప్రయాణిస్తుంది. ఉత్తర భారతదేశం నుంచి వచ్చే ఈ విషపూరిత గాలి తూర్పు భారతదేశంపైన ప్రభావం చూపుతుందిబీ కొన్నిసార్లు అది దక్షిణ భారత గాలులలో కలుస్తుంది. అంటే దేశం మొత్తం ఒకే గాలి వ్యవస్థలో భాగం. అందువల్ల దిల్లీ గాలి కాలుష్యం అనేది దేశవ్యాప్తంగా మిగతా నగరాలకు కూడా ముందస్తు హెచ్చరికలా మారుతోంది.అయితే పరిష్కారాల గురించి మాట్లాడితే ప్రధానంగా కాగితం మీదే ఎక్కువ. వాహనాలOdd-Even పద్ధతి తాత్కాలిక ఉపశమనం మాత్రమే. స్మాగ్ టవర్స్ వాస్తవానికి సమస్యను పరిష్కరించవు, మరీ పెద్ద ప్రాంతాలను శుభ్రం చేసే సామర్థ్యం వాటికి లేదు. పంట మిగులు నిర్వహణకు అనేక పథకాలు ప్రకటించినప్పటికీ, రైతుల ప్రత్యామ్నాయ ఖర్చులు,



శ్రమ శక్తి సమస్యలు, ప్రభుత్వాల సమన్వయం లేమి ఇవన్నీ సమస్యను అసలు స్థాయిలో పరిష్కరించకుండా ఊబిలోకి నెడుతున్నాయి. నిర్మాణాల ధూళిపై నియంత్రణ గురించి నియమాలు ఉన్నా, అమలు మాత్రం చాలా బలహీనంగా ఉంది.భారతదేశం శ్వాసను రక్షించాలంటే కేవలం దిల్లీ నిర్ణయాలే కాదు, దేశవ్యాప్తంగా సమిష్టిగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. యూరప్, చైనా, జపాన్ వంటి దేశాలు తమ నగరాలను శుభ్రపరుచుకున్నాయి, ఎందుకంటే వారు సమస్యను రాజకీయాల నుండి బయటకు తీసి, ప్రజల ఆరోగ్యాన్ని మొదటి స్థానంలో పెట్టారు. మనం కూడా ఆ దిశగా కదలాలి. లేకుంటే మరో 10–15 సంవత్సరాల్లో బెంగళూరు, హైదరాబాద్, ముంబై వంటి నగరాలు కూడా ఇదే దారి పట్టే ప్రమాదం ఉంది. ఇప్పటికే ట్రాఫిక్, నిర్మాణాల ఒత్తిడి వల్ల ఇవి ప్రమాదకర మార్గంలో నడుస్తున్నాయి.చివరగా, దిల్లీ గాలి కాలుష్యం కేవలం ఒక నగరం ఎదుర్కొంటున్న సమస్య కాదు భారతదేశం భవిష్యత్తుకు వచ్చిన స్పష్టమైన హెచ్చరిక. శ్వాస తీసుకోవడానికే మాస్కు ధరించాల్సిన పరిస్థితి సాధారణమైపోయే ముందు, ప్రభుత్వాలు, ప్రజలు, పరిశ్రమలు అందరూ కలిసి పనిచేయాల్సిన సమయం ఇది. శ్వాస కోసం పోరాటం అంటే ఇది కేవలం పర్యావరణ సమస్య కాదుబీ జీవన మౌలిక హక్కు కోసం మనిషి చేస్తున్న యుద్ధం.

## డాక్టర్కు వీసా నిరాకరణతో ఆత్మహత్య

హైదరాబాద్, వీసా రాకపోవడంతో ఓ వైద్యురాలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. హైదరాబాద్ పద్మారావు నగర్లో ఈ ఘటన చోటు చేసుకుంది. కొద్ది రోజుల క్రితం డాక్టర్ రోహిణికి వీసా నిరాకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆమె మనస్థాపం చెంది నిద్రమాత్రలు మింగినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రోహిణి గదిలో సూసైడ్ నోట్ లభ్యమైంది. వైద్యురాలు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోహిణి మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

# పిల్లలకు చదువుతో పాటు నైతికి విలువలు

విజయవాడ,బడిలో పిల్లలకు ఆట పాటలు చదువుతో పాటు నైతిక విలువలు అందించాలని విద్యాసశ్ఖాఖ మంత్రి లోకేశ్ సూచించారు. అప్పుడే వారి తెలివితేటలు రాణిస్తాయని అన్నారు. ఆటోమిక్ ఎనర్జీని విద్యుత్ తయారీకి వాడితే దేశం అంతా ఘనంగా వెలుగుతుందని.. అదే ఆటోమిక్ ఎనర్జీని బాంబు తయారీకి వాడితే హిరోషిమా నాగసాకిలా తయారవుతుందని అన్నారు. ప్రభుత్వం పుస్తకాలు రూపొందిస్తోందన్నారు. ఇంట్లో నుంచి మార్పు మొదలవ్వాలని.. తల్లిదండ్రులు ఈ బాధ్యత తీసుకోవాలని కోరారు. నైతిక విలువలు, సమాజంలో మార్పుకు సంబంధించి సలహాదారుగా చాగంటి కోటేశ్వరరావును తీసుకున్నామని మంత్రి నారా లోకేష్ అన్నారు. సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విలువలు, విద్యా సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. చాగంటికి క్యాబినెట్ ర్యాంక్ ఇచ్చి సలహాదారుగా నియమించామని తెలిపారు. చాగంటి కోటేశ్వరరావు ప్రభుత్వ వాహనం వాడలేదని.. సొంతంగానే తన ఫోన్ బిల్లు చెల్లిస్తున్నారని చెప్పుకొచ్చారు. మహిళలను గౌరవించినప్పుడు సమాజం బాగుపడుతుందని తెలిపారు. వెబ్ సిరీస్లోనూ మహిళలను అగౌరవంగా చూపకూడదన్నారు. మగవారు, మహిళలు ఇద్దరు సమానమే అని స్పష్టం చేశారు. పిల్లలను చూస్తే దేవుడిని చూసినట్టు ఉంటుందని.. వాళ్ళని బాగా చూసుకోవాలని పేర్కొన్నారు. డ్రగ్స్పై తమ ప్రభుత్వం యుద్ధం ప్రకటించిందని.. దీన్ని అంతా సీరియస్గా తీసుకోవాలన్నారు. మార్కులు తక్కువగా వచ్చాయని ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి సరికాదన్నారు. జీవితంలో అవమానాలు సహజమని.. లక్ష్యంతో పనిచేస్తే విజయం సాధించగలమని



చెప్పుకొచ్చారు. టీచర్ల సమస్యలు చాలా వరకు పరిష్కరించామని తెలిపారు. కేజీ నుంచి పీజీ వరకు కరికులంలో మార్పులు తెస్తున్నామన్నారు. పుస్తకాల్లో ప్రజాప్రతినిధుల ఫోటోలు.. పార్టీ రంగులు లేవన్నారు. ప్రభుత్వం బాధ్యతగా పనిచేస్తోందని మంత్రి తెలిపారు.తల్లిదండ్రులు పెట్టుకున్న బాధ్యతను పిల్లలు నిలబెట్టుకోవాలని సూచనలు చేశారు. పుట్టపర్తిలో సత్యసాయి బాబా జయంతి కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. అక్కడకు వచ్చిన పిల్లలు ఓ చిన్న కాగితం చెత్తను కూడా వేయకుండా జాగ్రత్తగా అన్నింటిని చెత్తబుట్టలో వేయడం చాలా గొప్పవిషయమని కొనియాడారు. ఈ తరహా క్రమశిక్షణ అందరికీ రావాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో నైతిక విలువలపై ప్రసంగాలు చేయాలని చాగంటి కోటేశ్వరరావును మంత్రి నారా లోకేష్ కోరారు. కాగా.. ఈ సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి ప్రభుత్వ సలహాదారు, ప్రవచన ప్రముఖులు చాగంటి

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com